మార్నింగ్ కాఫీ విత్ హాట్ న్యూస్‌తో...! మీ

# డ్రీమ్ టైమ్స్

తెలుగు దిన పత్రిక

ఆదివారం 25 -10-2026
పేజీలు: 8 వెల: రూ.2/-

సంపుటి:5 సంచిక 325

Published from Kurnool circulated all over Andhra Pradesh and Telangana All District

## విలేకరులు కావలెను




తెలంగాణ ,ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రాల వ్యాప్తంగా డ్రీమ్ టైమ్స్ దినపత్రికలో బ్యూరో, మండలాల రిపోర్టర్ గా పని చేయుటకు జిల్లాల, నియోజకవర్గ స్థాయిలో ఉత్సాహవంతులైన యువతి ,యువకులు కావలెను, కొత్త వారికి మరియు అనుభవం ఉన్నవారికి అవకాశం ఇవ్వబడును

8500066609

# తిలక్ మెరుపులు

- 20 ఓవర్లలో ఐదు వికెట్లకు 180 పరుగులు చేసిన కివీస్
- 71 పరుగులకే ఐదు వికెట్లు కోల్పోయిన భారత్
- కీలక సమయంలో జట్టును ఆదుకున్న తిలక్ వర్మ
- 25 బంతుల్లోనే అర్ధశతకం పూర్తి చేసిన యువ బ్యాటర్
- 31 పరుగులతో రాణించిన నమన్ ధీర్
- చివర్లో నితీశ్ కుమార్ రెడ్డి మెరుపు బ్యాటింగ్
- ఒక బంతి మిగిలి ఉండగానే లక్ష్యాన్ని ఛేదించిన టీమిండియా

**న్యూజిలాండ్‌పై రెండో టీ20లో టీమిండియా గెలుపు**

03

ఓటమి అంచుల నుంచి టీమిండియా అద్భుత విజయాన్ని అందుకుంది. న్యూజిలాండ్‌తో జరిగిన రెండో టీ20లో తెలుగు కుర్రాళ్లు తిలక్ వర్మ, నితీష్ కుమార్ రెడ్డి బ్యాటింగ్‌లో మెరిసి భారత్‌ను గెలిపించారు. 181 పరుగుల లక్ష్యఛేదనలో 71 పరుగులకే ఐదు వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడిన భారత జట్టును తిలక్ వర్మ అర్ధశతకంతో ఆదుకోగా, కీలక సమయంలో నితీష్ రెడ్డి మెరుపు ఇన్నింగ్స్‌తో విజయాన్ని చేరువ చేశాడు. చివరి ఓవర్ వరకు నరాలు తెగే ఉత్కంఠ మధ్య సాగిన పోరులో ఒక బంతి మిగిలి ఉండగానే భారత్ లక్ష్యాన్ని ఛేదించింది.






03

# ఎల్‌నినో ఎఫెక్ట్..

- తొలిసారి 30 డిగ్రీలు దాటిన పసిఫిక్ మహాసముద్ర ఉష్ణోగ్రతలు..!
- అక్టోబర్ 22న అత్యధిక ఉష్ణోగ్రత నమోదైనట్లు నివేదిక
- డిసెంబర్ నాటికి ఎల్‌నినో మరింత బలపడే అవకాశం
- ప్రపంచవ్యాప్తంగా వర్షపాత నమూనాల్లో భారీ మార్పులు
- కొన్ని దేశాల్లో కరువు.. మరికొన్ని ప్రాంతాల్లో వరదల ముప్పు
- రానున్న నెలల్లో వర్షాభావ పరిస్థితులపై వాతావరణ నిపుణుల హెచ్చరిక

## రాష్ట్రాన్ని రాక్షసులకు

# వదిలేయాలా?

**ఎన్నికలు జరగడం ఇష్టం లేకే దాడులు.. విధ్వంసం**



**గొడ్డలిపార్టీ అరాచకాలను చూసూ ఊరుకోబోం**

**గొడ్డలి పార్టీ అధినేత ఓ క్రిమినల్ లిటిగెంట్..**

- హింసకు ప్రతిహింస కూటమి విధానం కాదు
- కానీ, దాడులు చేస్తుంటే భయపడి వెన్ను చూపబోం
- సీఎంగా, పార్టీ అధ్యక్షుడిగా విఫలం..
- కొడుకుగా, అన్నగా విఫలమైన చరిత్ర
- చివరికి బాధ్యతగల పౌరుడిగానూ పనికిరాడు
- అభివృద్ధికి వీలుంటుందనే స్థానిక ఎన్నికలు
- వాటిని సైతం వైసీపీ నేతలు అడ్డుకుంటున్నారు
- ఇప్పుడు ఏకంగా మేనకోడలి పెళ్లికీ అడ్డంకులు
- రాజకీయ విలువలే కాదు, కుటుంబ విలువలూ లేవు
- దౌర్జన్యాలు.. పిటిషన్లు.. లిటిగేషన్లు.. జగన్ నైజం
- రాష్ట్రం తగలబడినా తాను నెగ్గాలన్నదే లక్ష్యం
- బీసీలకు న్యాయం చేస్తుంటే, అడ్డుకున్నారు
- అధికారంలో ఉండగా చేసిన ఏకగ్రీవాలు మరిచారా?
- మీడియా సమావేశంలో సీఎం చంద్రబాబు ఆగ్రహం

ఒక్క చాన్స్ అంటూ అధికారంలోకి వచ్చి, పనిచేసిన ఐదేళ్లూ రాష్ట్రాన్ని అధోగతి పాలు చేసి విఫల సీఎంగా ముద్రపడ్డారు. పార్టీని రౌడీలు, బ్లేడ్ బ్యాచ్‌లకు అడ్డాగా మార్చి పార్టీ అధ్యక్షుడిగా విఫలమయ్యారు. ఏ కొడుకూ చేయని విధంగా తండ్రి పేరును బజారుకీడ్చి కొడుకుగా విఫలమయ్యారు. చెల్లెళ్లకు అన్యాయం చేసి అన్నగా విఫలమయ్యారు. చివరికి ఓ బాధ్యతగల పౌరుడిగానూ జగన్ విఫలమయ్యారు.

**అమరావతి,**

జగన్ అన్ని విధాలా విఫలమైన వ్యక్తి అని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రిగా, పార్టీ అధ్యక్షునిగా, కుమారుడిగా, అన్నగా.. చివరకు దేశ పౌరుడిగానూ జగన్‌ది విఫల చరిత్రేనని మండిపడ్డారు. "రాష్ట్రాభివృద్ధి పట్టదు. దేశం గురించి పట్టదు. చివరికి ప్రజాసమస్యలపై చర్చించేందుకు అసెంబ్లీకి రమ్మంటే అక్కడికీ రాడు. ఇలాంటి వ్యక్తులను ఎన్నుకోవడం వల్ల సమాజానికి ఎలాంటి ఉపయోగం కలుగుతుందో ప్రజలు ఆలోచన చేయాలి." అని సీఎం కోరారు.

-మిగతా3 లో



## షర్మిల కుమార్తె పెళ్లికి బెంగళూరు ఇల్లు ఇవ్వలేను!

- చెల్లెలు షర్మిలకు జగన్ రాసిన లేఖను బయటపెట్టిన వైసీపీ
- భద్రతాపరమైన సమస్యల కారణంగానే అభ్యంతరమని స్పష్టీకరణ
- కుటుంబ భద్రత, వ్యక్తిగత గోప్యత ముఖ్యమన్న జగన్
- ప్రత్యామ్నాయంగా హైదరాబాద్ లోటస్‌పాండ్‌ను పరిశీలించాలని సూచన

తాడేపల్లి, అమరావతి, ఏపీ బ్యూరో,

వైసీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తన సోదరి వైఎస్ షర్మిలకు రాసిన లేఖ రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. షర్మిల కుమార్తె అంజలి వివాహాన్ని బెంగళూరులోని తన నివాసంలో నిర్వహించేందుకు అంగీకరించలేనని జగన్ స్పష్టం చేశారు. భద్రతాపరమైన సమస్యలు, కుటుంబ గోప్యతను దృష్టిలో ఉంచుకునే ఈ నిర్ణయం తీసుకున్నట్లు వివరించారు. అక్టోబర్ 9న షర్మిలకు రాసినట్లు పేర్కొంటున్న ఈ లేఖను వైసీపీ తాజాగా బహిర్గతం చేసింది. మేనకోడలు అంజలి వివాహం జరగనుండటం పట్ల జగన్ లేఖలో తొలుత సంతోషం వ్యక్తం చేశారు. అయితే వివాహ వేడుకను బెంగళూరులోని తన నివాసంలో నిర్వహించాలని షర్మిల కుటుంబం భావిస్తున్నట్లు తెలిసిందని పేర్కొన్నారు.

-మిగతా 3 లో



03

## ఇరాన్‌పై మళ్లీ యుద్ధ మేఘాలు!

- ఒప్పందం కుదరకపోతే మరోసారి సైనిక చర్య తప్పదన్న ట్రంప్
- పశ్చిమాసియాలో మరో 'ఎపిక్ ఫ్యూరీ' జరగొచ్చంటూ హెచ్చరిక
- ఈ వారాంతంలో ఇరాన్‌పై అమెరికా దాడులకు దిగే అవకాశం
- ట్రంప్ వ్యాఖ్యలతో పశ్చిమాసియాలో మళ్లీ తీవ్ర ఉద్రిక్తతలు
- నిప్పుతో చెలగాటమాడొద్దంటూ అమెరికాకు ఇరాన్ గట్టి హెచ్చరిక
- దాడులు జరిగితే సముద్రగర్భ కమ్యూనికేషన్ కేబుళ్లను ధ్వంసం చేస్తామన్న టెహ్రాన్



## వేమనా.. ఈ దీనస్థితి ఏందన్నా?

- విగ్రహం పెట్టారు.. గౌరవం మరిచారు!
- మహాకవి విగ్రహం చుట్టూ చెత్తాచెదారం.. వెనుక రేకుల షెడ్డు
- నిర్లక్ష్యానికి నిలువెత్తు నిదర్శనంగా వేమన విగ్రహ

**చిట్వేలి (డ్రీమ్ టైమ్స్), అక్టోబరు 24:**

విశ్వదాభిరామ వినుర వేమ..

తెలుగు నేలపై ఈ మాట తెలియని వారుండరంటే అతిశయోక్తి కాదు. అతి సామాన్యమైన పదాలతో జీవిత సత్యాలను బోధించి, సమాజంలోని మూఢనమ్మకాలను, కులవివక్షను, మానవుల మధ్య అసమానతలను తన పద్యాల ద్వారా ప్రశ్నించిన మహాకవి వేమన. పామరులకు సైతం సులభంగా అర్థమయ్యే పద్యాలతో ప్రజాకవిగా కీర్తి గడించిన వేమనకు చిట్వేలి మండలంతోనూ అనుబంధం ఉందని స్థానిక సాహితీవేత్తలు చెబుతున్నారు. ఆయన జ్ఞాపకాలను భావితరాలకు అందించాలనే ఉద్దేశంతో చిట్వేలి గ్రామపంచాయతీ కార్యాలయం ఎదుట, ప్రధాన రహదారి పక్కన వేమన విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. అయితే, ఆ మహాకవి విగ్రహం ప్రస్తుతం కనిపిస్తున్న దీనస్థితి మాత్రం సాహితీ ప్రియులను కలచివేస్తోంది.

విగ్రహం ఉంది..

**గౌరవం ఏది?**

మహాకవి విగ్రహాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయమే. కానీ, ఆ విగ్రహానికి తగిన గౌరవాన్ని కాపాడటం కూడా అంతే ముఖ్యం. చిట్వేలిలో వేమన విగ్రహం చుట్టూ గ్రామపంచాయతీకి

-మిగతా 7 లో



# యూకేలో ఎమర్జెన్సీ అలర్ట్..

- మూడు రోజులకు సరుకులు ఉంచుకోవాలన్న సర్కారు..!
- ప్రకృతి విపత్తులు, సైబర్ దాడుల నేపథ్యంలో 'బీ రెడీ' ప్రచారం
- ఆహారం, నీరు, నగదు, టార్చిలైట్లు అందుబాటులో ఉంచుకోవాలని విజ్ఞప్తి
- ఒకేసారి కొనుగోళ్లు చేయొద్దని ప్రజలకు సూచన

03



## నవంబర్ 1న జరిగే ర్యాలీని వాయిదా వేసుకోండి..

- రాహుల్ గాంధీకి వ్యాపార సంఘాల వినతి
- దీపావళి వ్యాపారాలకు ఆటంకం కలుగుతుందని ఆందోళన
- రూ.10 వేల కోట్ల వరకు నష్టం వాటిల్లే అవకాశముందని అంచనా
- రాహుల్ గాంధీకి సీటీఐ చైర్మన్ బ్రిజేష్ గోయల్ లేఖ
- నవంబర్ 10 తర్వాత ర్యాలీ నిర్వహించాలని వినతి
- పండుగల సమయంలో రవాణా ఆంక్షలతో ఇబ్బందులని వెల్లడి

03

## ఏఐని చూసి

# భయపడొద్దు

**అవకాశాలను అందిపుచ్చుకోండి!**

- ఉద్యోగాలను హరించే భూతంగా కృత్రిమ మేధను చూడొద్దు
- మారుతున్న సాంకేతికతకు అనుగుణంగా నైపుణ్యాలు పెంచుకోవాలి
- కొత్త ఉపాధి అవకాశాలకు ఏఐ మార్గం సుగమం చేస్తుంది
- పెట్టుబడులు, ఉద్యోగాల కల్పనలో ప్రైవేట్ రంగానిదే కీలక పాత్ర
- వ్యవసాయం నుంచి వైద్యం వరకు సాంకేతికతను విస్తరించాలి
- ర్యాండమ్ ట్రీస్ సంస్థ కార్యాలయ ప్రారంభంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

హైదరాబాద్, తెలంగాణ బ్యూరో:

కృత్రిమ మేధస్సు (ఏఐ)ను ఉద్యోగాలను హరించే భూతంగా కాకుండా కొత్త అవకాశాలను సృష్టించే సాంకేతిక సాధనంగా చూడాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ యువతకు పిలుపునిచ్చారు. ప్రపంచవ్యాప్తంగా వేగంగా మారుతున్న సాంకేతిక పరిణామాలకు అనుగుణంగా నైపుణ్యాలను పెంపొందించుకుంటూ భవిష్యత్తు అవకాశాలను అందిపుచ్చుకోవాలని సూచించారు. ఏఐ వల్ల ఉద్యోగాలు పోతాయనే భయంతో వెనుకడుగు వేయకుండా, దానిని సమర్థంగా వినియోగించుకునే సామర్థ్యాన్ని పెంచుకోవాలన్నారు. హైదరాబాద్‌లో డేటా, ఏఐ, ఇన్నోవేషన్ రంగాల్లో పనిచేస్తున్న ర్యాండమ్ ట్రీస్

-మిగతా3 లో



## కశ్మీరీలను పాకిస్థాన్ కాపాడుతున్నది

**ఫరూఖ్ అబ్దుల్లా వివాదాస్పద వ్యాఖ్యలు**

**దేశద్రోహంగా అభివర్ణించిన బీజేపీ**



**శ్రీనగర్:న్యూఢిల్లీ, అక్టోబర్ 24 డ్రీమ్ టైమ్స్**

నేషనల్ కాన్ఫరెన్స్(ఎన్‌సీ) అధ్యక్షుడు ఫరూక్ అబ్దుల్లా మరోమారు వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. బారాముల్లాలో జరిగిన పార్టీ కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతూ అంతర్జాతీయ వేదికలపై కశ్మీర్ సమస్యను లేవనెత్తుతూ, పాకిస్థాన్ ఇక్కడి ప్రజలను కాపాడుతున్నదని వ్యాఖ్యానించారు.ఈ ప్రాంతంపై కేంద్ర ప్రభుత్వ ఉద్దేశాలు సరిగా లేవని, బీజేపీ పాలిత రాష్ట్రాల్లో మైనారిటీల ఆస్తులు, ప్రార్థనా మందిరాలను లక్ష్యంగా చేసుకుని కూల్చివేతలు చేపడుతున్నారని ఆరోపించారు. ఈ నేపథ్యంలో దేశంలోని ముస్లింలంతా ఐక్యంగా నిలవాలని ఫరూక్ అబ్దులా పిలుపునిచ్చారు. ఈ వ్యాఖ్యలపై బీజేపీ తీవ్రంగా మండిపడింది. జే అండ్ కే బీజేపీ చీఫ్ సత్ శర్మ ఆయన వ్యాఖ్యలను దేశద్రోహంగా అభివర్ణించారు.

## భారత్ మోస్ట్ వాంటెడ్ నేరగాడు అమెరికాలో అరెస్ట్

**హిమాంశుపై 30కి పైగా కేసులు..రెడ్ కార్నర్ నోటీస్**



**వాషింగ్టన్:న్యూఢిల్లీ, అక్టోబర్ 24 డ్రీమ్ టైమ్స్**

భారత్ మోస్ట్ వాంటెడ్ నేరగాడు(గ్యాంగ్‌స్టర్) హిమాంశు భౌను ఎఫ్‌బీఐ అమెరికాలో గురువారం అరెస్ట్ చేసింది. ఇండియన్ ఎక్స్‌ప్రెస్ కథనం ప్రకారం.. లాస్ వెగాస్‌లో హిమాంశు దాక్కొన్నట్టు భారత దర్యాప్తు సంస్థలు గుర్తించి ఎఫ్‌బీఐకి సమాచారమిచ్చాయి.అతడిపై హత్య, హత్యాయత్నం, దోపిడీ, ఆయుధాల అక్రమ రవాణాకు సంబంధించి భారత్‌లోని వివిధ రాష్ట్రాల్లో 30కి పైగా కేసులు నమోదయ్యాయి. అతడిపై ఇంటర్‌పోల్ 2023లో రెడ్ కార్నర్ నోటీస్ జారీ చేసింది. అమెరికాలో ఉంటూనే తన నెట్‌వర్క్ ద్వారా హిమాంశు భారత్‌లో నేరాలకు, వ్యాపారుల నుంచి డబ్బు వసూళ్లకు పాల్పడినట్టు దర్యాప్తు సంస్థలు వెల్లడించాయి.

## ఫిలిప్పైన్స్‌లో రెండు సైనిక విమానాలు ఢీ..

**- నలుగురు పైలట్లు మృతి**



**న్యూఢిల్లీ, అక్టోబర్ 24 డ్రీమ్ టైమ్స్**

ఫిలిప్పైన్స్‌లో ఘోర విమాన ప్రమాదం జరిగింది. ఫిలిప్పైన్స్ సైన్యానికి చెందిన రెండు శిక్షణ విమానాలు ఢీకొన్నాయి. ఈ ఘటనలో నలుగురు పైలట్లు మరణించారు. ఈ ఘటన ఫిలిప్పైన్స్ రాజధాని మనీలా దక్షిణ ప్రాంతంలో ఉన్న ఎయిర్ బేస్ వద్ద శుక్రవారం జరిగింది. స్థానిక బటాంగాస్ ప్రావిన్స్‌లోని ఫెర్నాండో ఎయిర్ బేస్ సమీపంలో ఎస్ఎఫ్-260 అనే రెండు యుద్ధ విమానాలు గాలిలోనే ఢీకొన్నాయి. ఈ సమయంలో రెండు విమానాల్లో ఉన్న నలుగురు పైలట్లు మరణించారు.విమానాలు ఢీకొని ఎయిర్ బేస్ ప్రాంతంలోనే కూలిపోయాయి. ఘటన గురించి తెలిసిన వెంటనే సహాయక బృందాలు రంగంలోకి దిగాయి. పైలట్ల మృతదేహాల్ని స్వాధీనం చేసుకున్నాయి. ఈ విమానాలు పైలట్లకు శిక్షణ ఇచ్చేందుకు వాడుతారు. ఈ ఘటన తర్వాత ఎస్ఎఫ్-260 యుద్ధ విమానాల్ని ఫిలిప్పైన్స్ ఎయిర్ ఫోర్స్ విభాగం నిలిపివేసింది. తాత్కాలికంగా విమాన సేవల్ని నిలిపివేసినట్లు తెలిపింది. విమాన ప్రమాదంపై విచారణ జరుగుతోందని సైనిక విభాగం వెల్లడించింది. విమానాలు ఢీకొనడానికి గల కారణాలపై దర్యాప్తు బృందం విచారణ జరుపుతోందని వివరించింది. ఈ ఘటనకు సంబంధించి పైలట్లు శిక్షణలో ఉన్నారని, వారు మరణించడం విచారకరమని వ్యాఖ్యానించింది. ఎస్ఎఫ్-260 యుద్ధ విమానాలు గతంలో కూడా ప్రమాదాలకు గురయ్యాయి. గత మేలో ఎస్ఎఫ్-260 యుద్ధ విమానం కూలిన ఘటనలో ఇద్దరు పైలట్లు మరణించారు. అంతకుముందు 2023లో కూడా ఎస్ఎఫ్-260 టీపీ మార్చెట్టి అనే విమానం కూడా కూలిపోయింది. ఈ ఘటనలో కూడా ఇద్దరు పైలట్లు మరణించారు. ఫిలిప్పైన్స్‌లో ఈ విమానాలు తరచూ ప్రమాదాలకు గురి కావడంపై ఆందోళన వ్యక్తమవుతోంది.

# భారత్ ఓ 'ఆకలి రాజ్యం'!

**-ప్రపంచ ఆకలి సూచీలో మనది 100వ స్థానం**

**-గడచిన 14 ఏండ్లుగా అదే స్థానంలో కొనసాగింపు**



**న్యూఢిల్లీ, అక్టోబర్ 24 డ్రీమ్ టైమ్స్**

అభివృద్ధిలో భారత్ అగ్రరాజ్యాలతో పోటీపడుతున్నట్టు, తృతీయ ఆర్థిక శక్తిగా ఎదుగుతున్నట్టు ప్రకటించుకుంటున్న నరేంద్ర మోదీ నేతృత్వంలోని ఎన్‌డీయే ప్రభుత్వం గడచిన 12 ఏండ్లుగా అధికారంలో సాగుతున్నప్పటికీ ఆకలి నిర్మూలనలో మాత్రం దేశంలో ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా తయారైంది. 2026 సంవత్సరానికి గ్లోబల్ హంగర్ ఇండెక్స్-జీహెచ్ఐ(ప్రపంచ ఆకలి సూచి)లో 122 దేశాలలో భారతదేశం 100వ స్థానంలో ఉంది.ఈ సూచికను జర్మన్ సహాయ సంస్థ వెల్ట్‌హంగర్‌హిల్ఫ్(డబ్ల్యూహెచ్‌హెచ్), ఐరిష్ సంస్థ కన్సర్న్ వరల్డ్‌వైడ్, భాగస్వామ్య సంస్థలైన ఇన్‌స్టిట్యూట్ ఫర్ ఇంటర్నేషనల్ లా ఆఫ్ పీస్ అండ్ ఆర్మ్ కాన్‌ఫ్లిక్ట్, స్విస్ సంస్థ హెల్వటాస్‌లతో కలిసి సంయుక్తంగా విడుదల చేశాయి. 24.1 స్కోరుతోభారత్ ఇప్పటికీ 'తీవ్రమైన' వర్గంలోనే కొనసాగుతున్నది. 2012 నుంచి దేశం ఈ వర్గం నుంచి బయటపడలేకపోయింది. సూచిక ప్రకారం జనాభాలో 9.8 శాతం మంది పోషకాహార లోపంతో బాధపడుతున్నారు. ఐదేండ్ల లోపు పిల్లల్లో 29 శాతం మంది ఎదుగుదల లోపంతో ఉన్నారు. ఇది చాలా అధిక శాతం. భారత్‌లోని పిల్లల్లో 'వేస్టింగ్'(వయస్సుకు తగ్గ బరువు లేకపోవడం) 19 శాతానికి పెరిగింది. ఇది దక్షిణాసియాలోనే అత్యధికం. గతంతో పోలిస్తే ఇది 16.9 శాతం నుంచి పెరిగింది. ఆకలిని తగ్గించడంలో భారత్ సాధిస్తున్న పురోగతి మందగించింది. 2018 నుంచి 2026 మధ్య కాలంలో దీని స్కోరు 25.8 నుంచి 1.7 పాయింట్లు మాత్రమే మెరుగుపడింది. ఇది 2006 నుంచి 2012 మధ్య కాలంలో నమోదైన 8.2 పాయింట్ల మెరుగుదలతో పోలిస్తే చాలా తక్కువ. దక్షిణాసియా ప్రాంతం స్కోరు 23.5గా ఉండగా, ఇక్కడ పిల్లల్లో వేస్టింగ్ రేటు 15.8 శాతంగా ఉంది. ఇది ప్రపంచంలోని అన్ని ప్రాంతాల కంటే అత్యధికం. దక్షిణాసియాలో పరిస్థితి ఇప్పటికీ ఆందోళనకరంగానే ఉంది(ప్రపంచ ఆకలి సూచి 23.5). అనేక దేశాల్లో గత కొన్నేళ్లుగా పురోగతి నిలిచిపోయింది. రెండు దేశాల్లో-ముఖ్యంగా పాకిస్థాన్‌లో 2018తో పోలిస్తే పరిస్థితి మరింత దిగజారింది.

## ఏకంగా 23 దేశాలను చుట్టి మణిపూర్‌కు తిరిగొచ్చిన అమూర్ ఫాల్కన్స్..!



**న్యూఢిల్లీ, అక్టోబర్ 24 డ్రీమ్ టైమ్స్**

కొన్ని వేల కిలోమీటర్ల సుదీర్ఘ ప్రయాణం తర్వాత రెండు అమూర్ ఫాల్కన్ బర్డ్స్ సురక్షితంగా మణిపూర్ కు తిరిగొచ్చాయి. 'అపపాంగ్ ', 'అలాంగ్ ' అని పేరుపెట్టిన ఈ పక్షులు తమ వార్షిక వలస ప్రయాణంలో భాగంగా ఆసియా , ఆఫ్రికా ఖండాల్లోని 23 దేశాలను చుట్టి వచ్చాయని కేంద్ర పర్యావరణశాఖ మంత్రి భూపేందర్ యాదవ్ శనివారం ప్రకటించారు. ఈశాన్య చైనా లోని తమ సంతానోత్పత్తి కేంద్రాల నుంచి బయలుదేరిన 11 రోజుల తర్వాత ఇవి మణిపూర్‌లో వాలాయి.2025 నవంబర్‌లో 'వైల్డ్‌లైఫ్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇండియా' శాస్త్రవేత్తలు ఈ రెండు పక్షులకు శాటిలైట్ ట్యాగ్‌లు అమర్చి విడిచిపెట్టారు. అప్పటి నుంచి వాటి ప్రయాణ మార్గాన్ని నిరంతరం గమనించారు. సరిగ్గా ఏడాది తర్వాత అవి మళ్లీ మణిపూర్‌కు తిరిగి రావడంతో ఈ ట్రాకింగ్ సైకిల్ విజయవంతంగా పూర్తయింది. ఫాల్కన్ పక్షుల తిరిగిరాకతో పక్షి ప్రేమికులు, పర్యావరణవేత్తలు ఆనందం వ్యక్తంచేస్తున్నారు. ఈ పక్షులు మణిపూర్‌లోని తమెంగ్‌లాంగ్ జిల్లా పర్వత ప్రాంతాల్లో రెండు నుంచి మూడు వారాలపాటు ఉంటాయి. ఈ సమయంలో ఇక్కడి చెద పురుగులను ఆహారంగా తీసుకుని, తమ తదుపరి సుదీర్ఘ ప్రయాణానికి అవసరమైన శక్తి కోసం శరీరంలో కొవ్వును నిల్వ చేసుకుంటాయి. ఇక్కడ విశ్రాంతి తీసుకున్న తర్వాత తమ వలస ప్రయాణంలో అత్యంత కఠినమైన దశను ప్రారంభిస్తాయి. తదుపరి మజిలీగా ఇవి సోమాలియాకు బయలుదేరతాయి. అందుకోసం దాదాపు 6,000 కిలోమీటర్ల దూరం ఎక్కడా ఆగకుండా ప్రయాణిస్తాయి. ఈ ప్రయాణంలో అరేబియా సముద్రంపై సుమారు 3,000 కిలోమీటర్ల దూరం అవిశ్రాంతంగా ఎగరాల్సి ఉంటుంది. అమూర్ ఫాల్కన్లు ఈశాన్య ఆసియాలో సంతానోత్పత్తి చేసి శీతాకాలంలో ఆఫ్రికాకు వలస వెళతాయి. ఈ క్రమంలో ఈశాన్య భారతదేశం వాటికి కీలకమైన విశ్రాంతి కేంద్రంగా ఉన్నది. ఏటా తమ ప్రాంతానికి వచ్చే ఈ అతిథులను స్థానిక సమాజాలు ఎంతో ప్రేమగా చూసుకుంటూ, వాటి సంరక్షణలో కీలకపాత్ర పోషిస్తున్నాయి. కాగా, ఈ శాటిలైట్ ట్రాకింగ్ ద్వారా వాటి ప్రయాణ మార్గాలు, అద్భుతమైన సహనశక్తిపై శాస్త్రవేత్తలకు విలువైన సమాచారం అందుతున్నది.

## ముంబైలో అనుమానిత జైషే మహమ్మద్ ఉగ్రవాది అరెస్ట్..!



**న్యూఢిల్లీ, అక్టోబర్ 24 డ్రీమ్ టైమ్స్**

మహారాష్ట్ర రాజధాని ముంబై లో అనుమానిత జైషే ఎ మహమ్మద్ ఉగ్రవాది అరెస్టయ్యాడు. మహారాష్ట్ర తీవ్రవాద నిరోధక దళం అధికారులు అతడిని అరెస్టు చేశారు. పట్టుబడ్డ నిందితుడి పేరు మహమ్మద్ హసన్ అబు సర్మాద్ అక్తర్ గా గుర్తించారు. ఓ క్యాబ్ బుకింగ్ సేవల సంస్థలో బైక్ డ్రైవర్‌గా పని చేస్తున్న మహమ్మద్ హసన్ ఆన్‌లైన్‌లో తీవ్రవాద కంటెంట్‌ను వ్యాప్తి చేయడం, మత ఉద్రిక్తతలను రెచ్చగొట్టే కార్యకలాపాలు చేయడం లాంటి చర్యలకు పాల్పడుతున్నట నిఘా వర్గాలు గుర్తించాయి.వారి సమాచారం ఆధారంగా దర్యాప్తు చేపట్టిన ఏటీఎస్ అధికారులు.. ముంబైలోని మహిమ్ మెట్రో స్టేషన్ సమీపంలో అతడిని అరెస్ట్ చేశారు. నిందితుడికి నిషేధిత ఉగ్రవాద సంస్థ జైషే మహమ్మద్ కు చెందిన హ్యాండ్లర్లతో సంబంధాలు ఉన్నట్లు ప్రాథమిక దర్యాప్తులో అధికారులు గుర్తించారు. పాకిస్థానీ ఇంటెలిజెన్స్ ఆపరేటివ్‌లతోనూ అతడికి ప్రత్యక్ష సంబంధాలు ఉన్నట్లు తెలిసింది. మహమ్మద్ హసన్ టెలిగ్రామ్‌లో కొన్ని గ్రూపులు నడుపుతూ.. జైషే చీఫ్ మసూద్ అజార్ ప్రసంగాలను ఇతరులతో పంచుకుంటున్నట్లు అధికారులు తెలిపారు. ఇటీవల ప్రధాని మోదీ ముంబై పర్యటన సమయంలో చోటుచేసుకున్న భద్రతాలోపానికి సంబంధించిన నివేదికను కూడా అతడు పలు యాప్‌లలో పోస్టు చేసినట్లు అధికారులు గుర్తించారు. నిందితుడి మొబైల్ ఫోన్‌లో దేశ వ్యతిరేక కంటెంట్ ఉన్నట్లు తెలిపారు. అతడితో సంబంధం ఉన్న వారిని కనుగొనేందుకు చర్యలు చేపట్టినట్లు వెల్లడించారు.

## ముదురుతున్న యుద్ధం.. ఇంటర్నెట్‌కు కష్టం!

**యూపీఐ, వాట్సాప్ సహా పలు సేవలు నెమ్మదించే అవకాశం**



**న్యూఢిల్లీ, అక్టోబర్ 24 డ్రీమ్ టైమ్స్**

ఇరాన్, ఇజ్రాయెల్ -- అమెరికా యుద్ధం ప్రభావం ఇప్పటికే అంతర్జాతీయంగా ఇంధన ధరలపై పడింది. పరిస్థితి మరింత ముదిరితే మున్ముందు భారత్ సహా ప్రపంచంలోని పలు దేశాల్లో ఇంటర్నెట్ సేవలపైనా ప్రభావం పడే ప్రమాదం కనిపిస్తున్నది. ఇరాన్, అమెరికా మధ్య ఒప్పందం కుదరకపోతే మరోసారి సైనిక దాడులు చేపట్టవచ్చని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తాజాగా హెచ్చరించారు.అమెరికా, ఇజ్రాయెల్ మరోసారి దాడులు చేస్తే గల్ఫ్ ప్రాంతంలోని సముద్రగర్భ కమ్యూనికేషన్ కేబుళ్లను లక్ష్యంగా చేసుకుంటామంటూ ఇరాన్ ప్రతిస్పందించింది. ప్రపంచ అంతర్జాతీయ డాటా ట్రాఫిక్‌లో సుమారు 95 నుంచి 99 శాతం వరకు సముద్రగర్భ కేబుళ్ల ద్వారానే ప్రసారమవుతుంటుంది. హొర్ముజ్ జలసంధి ప్రపంచ వాణిజ్యానికి ఎంత ముఖ్యమో.. అంతర్జాతీయ కమ్యూనికేషన్ వ్యవస్థకు కూడా అంతే కీలకమైనది. ఈ ప్రాంతంలోని సముద్రగర్భ కేబుళ్లు ఆసియా, యూరప్, మధ్యప్రాచ్య దేశాల మధ్య ఇంటర్నెట్ కనెక్టివిటీని అందిస్తాయి. ఈ కేబుళ్ల ద్వారా భారీ మొత్తంలో డాటా ఒక దేశం నుంచి మరో దేశానికి చేరుతుంది. ఇరాన్ ఈ కేబుళ్లను ధ్వంసం చేస్తే భారత్‌లోని పలు డిజిటల్ సేవలపై కూడా ప్రభావం పడే అవకాశం ఉన్నది. బ్యాంకులు, చెల్లింపు వ్యవస్థల సర్వర్లతో కనెక్షన్ దెబ్బతింటే కొన్ని లావాదేవీలు విఫలమవ్వవచ్చు లేదా ఆలస్యమవ్వవచ్చు. వాట్సప్ సందేశాలు పంపడం, స్వీకరించడం, వాయిస్, వీడియో కాల్స్ చేయడంలో సమస్యలు తలెత్తవచ్చు. యూట్యూబ్ వీడియోలు లోడ్ కావడం నెమ్మదించవచ్చు లేదా స్ట్రీమింగ్‌లో అంతరాయాలు రావచ్చు. ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్ తదితర సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్‌లలో కంటెంట్ లోడ్ కావడం నెమ్మదించవచ్చు. విదేశీ సర్వర్ల ద్వారా పనిచేసే కొన్ని ఏఐ అప్లికేషన్లు ప్రభావితమయ్యే అవకాశం ఉన్నది. అయితే భారత్‌లో యూపీఐ, వాట్సప్ సహా అన్ని సేవలు పూర్తిగా నిలిచిపోతాయని చెప్పలేం. భారత్‌కు అనేక అంతర్జాతీయ సముద్రగర్భ కేబుళ్లు, ప్రత్యామ్నాయ నెట్‌వర్క్ మార్గాలు ఉన్నాయి. ప్రభావం కేబుళ్ల నష్టం ఎంత విస్తృతంగా ఉన్నది, ఏ మార్గాలు దెబ్బతిన్నాయి, ప్రత్యామ్నాయ మార్గాల సామర్థ్యం ఎంత అనే అంశాలపై ఆధారపడి ఉంటుంది. ఒకటి లేదా కొన్ని కేబుళ్లు దెబ్బతింటే మిగిలిన కేబుళ్ల ద్వారా డాటాను మళ్లించే అవకాశం ఉంటుంది. కానీ ఒకే కీలక ప్రాంతంలో అనేక కేబుళ్లు ఒకేసారి దెబ్బతింటే పరిస్థితి మరింత తీవ్రంగా మారవచ్చు.

## షర్మిల కుమార్తె పెళ్లికి బెంగళూరు ఇల్లు ఇవ్వలేను!

(మొదటి తరువాయి)

ఆ ఇంట్లో పెద్దఎత్తున వివాహ కార్యక్రమం నిర్వహిస్తే తీవ్రమైన భద్రతాపరమైన ఇబ్బందులు ఎదురయ్యే అవకాశముందని తెలిపారు. ఈ అంశాన్ని కేవలం కుటుంబ వ్యవహారంగా కాకుండా భద్రత, వ్యక్తిగత గోప్యతకు సంబంధించిన విషయంగా పరిగణించాలని కోరారు. బెంగళూరులోని నివాసం తన కుటుంబం ఉండే వ్యక్తిగత గృహమని, అక్కడ కుటుంబ సభ్యుల భద్రతకు ప్రాధాన్యం ఇవ్వాల్సిన అవసరం ఉందని జగన్ పేర్కొన్నారు. తన సొంత పిల్లల వివాహం విషయంలోనూ ఇలాంటి పరిస్థితి ఎదురైతే భద్రత దృష్ట్యా ఇదే నిర్ణయం తీసుకుంటానని స్పష్టం చేశారు. ఈ నిర్ణయం వెనుక వ్యక్తిగత కారణాలు కాకుండా భద్రతాపరమైన ఆందోళనలే ఉన్నాయని వివరించారు. వివాహ వేదికకు సంబంధించి తనకున్న అభ్యంతరాలను ఇప్పటికే కొందరి ద్వారా తెలియజేసినట్లు జగన్ లేఖలో పేర్కొన్నారు. అయినప్పటికీ తన ఇబ్బందులను పరిగణనలోకి తీసుకోకపోవడం బాధ కలిగించిందని తెలిపారు. తన పరిస్థితిని అర్థం చేసుకుని వివాహానికి మరో అనువైన వేదికను ఎంపిక చేసుకోవాలని షర్మిలను కోరారు. ప్రత్యామ్నాయంగా హైదరాబాద్‌లోని లోటస్‌పాండ్ నివాసాన్ని పరిశీలించవచ్చని జగన్ సూచించారు. వివాహ వేడుకను అక్కడ నిర్వహించుకునే అవకాశాన్ని పరిశీలించాలని కోరారు. అంజలి వివాహ ఏర్పాట్లపై చర్చలు జరుగుతున్న నేపథ్యంలో బెంగళూరు నివాసం విషయంలో జగన్ వైఖరిని స్పష్టం చేసేందుకే వైసీపీ ఈ లేఖను విడుదల చేసినట్లు తెలుస్తోంది. అయితే ఈ లేఖపై షర్మిల స్పందన ఏమిటన్నది తెలియాల్సి ఉంది. కుటుంబానికి సంబంధించిన వివాహ వేడుక వేదిక అంశం ఇప్పుడు బహిరంగ చర్చకు రావడం ప్రాధాన్యం సంతరించుకుంది.

## ఎల్‌నినో ఎఫెక్ట్..

న్యూఢిల్లీ:



ఎల్‌నినో ప్రభావంతో పసిఫిక్ మహాసముద్రంలో సముద్ర ఉపరితల ఉష్ణోగ్రతలు రికార్డు స్థాయికి చేరుకున్నట్లు వాతావరణ నివేదికలు వెల్లడించాయి. భూమధ్యరేఖకు సమీపంలోని మధ్య పసిఫిక్ ప్రాంతంలో అక్టోబర్ 22న సముద్ర ఉపరితల ఉష్ణోగ్రతలు 30 డిగ్రీల సెల్సియస్ మార్కును చేరుకున్నట్లు అమెరికా జాతీయ సముద్ర, వాతావరణ పరిపాలనా సంస్థ (ఎన్‌వోఏఏ) సమాచారాన్ని ఉటంకిస్తూ ఇండియా టుడే పేర్కొంది. అందుబాటులో ఉన్న రికార్డుల ప్రకారం ఈ ప్రాంతంలో ఉష్ణోగ్రతలు ఇంతటి స్థాయికి చేరడం ఇదే తొలిసారని నివేదిక తెలిపింది. ఎల్‌నినో తీవ్రత పెరుగుతుండటంతో ప్రపంచవ్యాప్తంగా వాతావరణ పరిస్థితుల్లో మార్పులు చోటుచేసుకునే అవకాశముందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. పసిఫిక్ మహాసముద్రంలోని మధ్య, తూర్పు ఉష్ణమండల ప్రాంతాల్లో సముద్ర ఉపరితల జలాలు సాధారణం కంటే అధికంగా వేడెక్కడాన్ని ఎల్‌నినోగా పిలుస్తారు. దీని ప్రభావంతో సముద్రంపై వీచే గాలులు, మేఘాల కదలికలు, వర్షపాత నమూనాల్లో మార్పులు సంభవిస్తాయి. ఈ పరిణామాలు పసిఫిక్ ప్రాంతానికే పరిమితం కాకుండా ప్రపంచంలోని అనేక దేశాల వాతావరణాన్ని ప్రభావితం చేస్తాయి. కొన్ని ప్రాంతాల్లో తీవ్రమైన కరువు, అధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉండగా, మరికొన్ని చోట్ల భారీ వర్షాలు, వరదలు సంభవించే ప్రమాదముంది. ప్రపంచ వాతావరణ సంస్థ అంచనాల ప్రకారం అక్టోబర్ నుంచి డిసెంబర్ మధ్య ఎల్‌నినో మరింత బలపడి, డిసెంబర్ నాటికి గరిష్ఠ స్థాయికి చేరే అవకాశముంది. ఎల్‌నినో తీవ్రతను అంచనా వేసేందుకు ఉపయోగించే నినో 3.4 సూచీలో సముద్ర ఉష్ణోగ్రతలు జూన్‌లో సాధారణం కంటే 1.6 డిగ్రీలు, ఆగస్టులో 2.5 డిగ్రీలు అధికంగా నమోదైనట్లు నివేదిక పేర్కొంది. అక్టోబర్ నుంచి డిసెంబర్ మధ్య ఈ వ్యత్యాసం 3.7 డిగ్రీలకు చేరవచ్చని అంచనా వేసింది. ఇదే జరిగితే గత రికార్డులను అధిగమించే అవకాశం ఉంది. మరోవైపు భారత్‌పైనా ఎల్‌నినో ప్రభావం ఉండవచ్చని వాతావరణ నిపుణులు చెబుతున్నారు. 2026 నైరుతి రుతుపవనాల సీజన్‌లో దేశవ్యాప్తంగా సాధారణం కంటే 13 శాతం తక్కువ వర్షపాతం నమోదైనట్లు నివేదిక వెల్లడించింది. అక్టోబర్ నుంచి డిసెంబర్ మధ్య దేశంలోని అనేక ప్రాంతాల్లో వర్షపాతం తగ్గే అవకాశముందని భారత వాతావరణ శాఖ అంచనా వేసింది. అయితే దక్షిణ ద్వీపకల్ప ప్రాంతంలో సాధారణ వర్షపాతం నమోదయ్యే సూచనలు ఉన్నాయని తెలిపింది. ఎల్‌నినోతో పాటు ఇతర వాతావరణ పరిస్థితులు కూడా వర్షపాతాన్ని ప్రభావితం చేస్తాయని, ప్రాంతాలవారీగా పరిస్థితులు మారవచ్చని నిపుణులు స్పష్టం చేస్తున్నారు.

## ఇరాన్‌పై మళ్లీ యుద్ధ మేఘాలు!

వాషింగ్టన్, అక్టోబర్ 24



పశ్చిమాసియాలో మరోసారి యుద్ధ మేఘాలు కమ్ముకుంటున్నాయి. ఇరాన్‌తో ఒప్పందం కుదరకపోతే మరోసారి సైనిక చర్యకు దిగే అవకాశముందని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ హెచ్చరించారు. ఫ్లోరిడాలో మధ్యంతర ఎన్నికల ప్రచార ర్యాలీలో ఆయన చేసిన వ్యాఖ్యలు అంతర్జాతీయంగా కలకలం రేపాయి. పశ్చిమాసియాలో మరో చిన్నస్థాయి 'ఆపరేషన్ ఎపిక్ ఫ్యూరీ' జరగవచ్చని ట్రంప్ సంకేతాలివ్వడంతో ఇరాన్‌పై అమెరికా మరోసారి దాడులకు సిద్ధమవుతోందన్న ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. ఈ వారాంతంలోనే సైనిక చర్యలు చేపట్టే అవకాశముందన్న ప్రచారం నేపథ్యంలో గల్ఫ్ దేశాల్లో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఇరాన్‌తో చర్చల ద్వారా సమస్యను పరిష్కరించుకోవాలన్నదే తమ అభిమతమని, అయితే ఒప్పందం కుదరకపోతే సైనిక చర్యను తోసిపుచ్చలేమని ట్రంప్ వ్యాఖ్యానించారు. అంతకుముందు తుర్కియేలో అమెరికా రాయబారి టామ్ బారక్ ఓ పాడ్‌కాస్ట్‌లో మాట్లాడుతూ ఈ వారాంతంలో ఇరాన్‌పై అమెరికా దాడులు జరిపే అవకాశముందని పేర్కొన్నారు. తొలుత ఈ వ్యాఖ్యలను ట్రంప్ తోసిపుచ్చారు. అలాంటి దాడుల ప్రణాళిక గురించి తనకు సమాచారం లేదని చెప్పారు. అయితే తాజాగా ఆయనే సైనిక చర్యకు సంబంధించిన సంకేతాలివ్వడం ప్రాధాన్యం సంతరించుకుంది. మరోవైపు అమెరికా హెచ్చరికలపై ఇరాన్ తీవ్రంగా స్పందించింది. తమ దేశంపై మరోసారి దాడులకు పాల్పడితే పరిణామాలు తీవ్రంగా ఉంటాయని హెచ్చరించింది. నిప్పుతో చెలగాటమాడవద్దని అమెరికాకు స్పష్టం చేసింది. తమ భూభాగంపై దాడులు జరిగితే ప్రతీకార చర్యలకు ఎలాంటి పరిమితులు ఉండబోవని తేల్చిచెప్పింది

## యూకేలో ఎమర్జెన్సీ అలర్ట్..

లండన్:



అత్యవసర పరిస్థితులను ఎదుర్కొనేందుకు ప్రజలు ముందస్తుగా సిద్ధంగా ఉండాలని యూకేలో 'బీ రెడీ' పేరుతో అవగాహన కార్యక్రమాన్ని ప్రారంభించారు. తీవ్రమైన వాతావరణ పరిస్థితులు, కార్చిచ్చులు, సైబర్ దాడులు, నిత్యావసర సేవలకు అంతరాయం వంటి పరిస్థితులు ఎదురైతే కనీసం మూడు రోజుల పాటు ఇబ్బందులు లేకుండా గడిపేందుకు అవసరమైన వస్తువులను ఇళ్లలో అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. ఆహారం, తాగునీరు, విద్యుత్ సరఫరా, ఇంటర్నెట్, డిజిటల్ చెల్లింపు వ్యవస్థలకు అంతరాయం కలిగే అవకాశాలను దృష్టిలో ఉంచుకుని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఆండీ బర్న్‌హామ్ నేతృత్వంలోని స్థానిక యంత్రాంగం సూచించింది. అత్యవసర సమయాల్లో ఉపయోగపడే ఆహార పదార్థాలు, తాగునీరు, టార్చిలైట్లు, బ్యాటరీలు, దుప్పట్లు వంటి వస్తువులను సిద్ధంగా ఉంచుకోవాలని కోరింది. విద్యుత్, ఇంటర్నెట్ సేవలు నిలిచిపోయినప్పుడు సమాచారం తెలుసుకునేందుకు బ్యాటరీలతో పనిచేసే రేడియో ఉపయోగపడుతుందని తెలిపింది. డిజిటల్ చెల్లింపులు పనిచేయని పరిస్థితుల్లో అవసరాలకు కొంత నగదు అందుబాటులో ఉంచుకోవాలని సూచించింది. ఇందుకు సంబంధించిన నిత్యావసర వస్తువుల జాబితాను 'బీ రెడీ' వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచినట్లు పేర్కొంది. అయితే ప్రజలు ఆందోళనతో ఒకేసారి మార్కెట్లకు వెళ్లి పెద్ద మొత్తంలో వస్తువులు కొనుగోలు చేయాల్సిన అవసరం లేదని స్పష్టం చేసింది. ప్రతి వారం సాధారణ కొనుగోళ్ల సమయంలోనే కొద్దికొద్దిగా అత్యవసర సామగ్రిని సమకూర్చుకోవాలని సూచించింది. అనుకోని విపత్తులు ఎదురైనప్పుడు ప్రజలు ఇబ్బందులు పడకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకునేలా అవగాహన కల్పించడమే ఈ ప్రచార ప్రధాన ఉద్దేశమని తెలిపింది.

# తిలక్ మెరుపులు..

**-న్యూజిలాండ్‌పై రెండో టీ20లో టీమిండియా గెలుపు**
**-20 ఓవర్లలో ఐదు వికెట్లకు 180 పరుగులు చేసిన కివీస్**
**-71 పరుగులకే ఐదు వికెట్లు కోల్పోయిన భారత్**
**-కీలక సమయంలో జట్టును ఆదుకున్న తిలక్ వర్మ**
**-25 బంతుల్లోనే అర్ధశతకం పూర్తి చేసిన యువ బ్యాటర్**
**-31 పరుగులతో రాణించిన నమన్ ధీర్**
**-చివర్లో నితీశ్ కుమార్ రెడ్డి మెరుపు బ్యాటింగ్**
**-ఒక బంతి మిగిలి ఉండగానే లక్ష్యాన్ని ఛేదించిన టీమిండియా**



క్రైస్ట్‌చర్చ్:
న్యూజిలాండ్‌తో జరిగిన రెండో టీ20లో భారత జట్టు ఉత్కంఠభరిత విజయాన్ని అందుకుంది. యువ బ్యాటర్ తిలక్ వర్మ అద్భుత అర్ధశతకంతో చెలరేగగా, చివర్లో తెలుగు క్రికెటర్ నితీశ్ కుమార్ రెడ్డి మెరుపులు మెరిపించాడు. దీంతో 181 పరుగుల భారీ లక్ష్యాన్ని భారత్ ఒక బంతి మిగిలి ఉండగానే ఛేదించింది. ఆరంభంలో వరుస వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడిన టీమిండియా.. కీలక సమయంలో పుంజుకుని విజయాన్ని సొంతం చేసుకుంది. చివరి ఓవర్ వరకు సాగిన ఈ పోరు అభిమానులకు అసలైన క్రికెట్ మజాను అందించింది. శనివారం జరిగిన ఈ మ్యాచ్‌లో టాస్ గెలిచిన భారత జట్టు తొలుత బౌలింగ్ ఎంచుకుంది. దీంతో బ్యాటింగ్‌కు దిగిన న్యూజిలాండ్ నిర్ణీత 20 ఓవర్లలో ఐదు వికెట్ల నష్టానికి 180 పరుగులు చేసింది. అనంతరం 181 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన టీమిండియాకు ఆరంభంలోనే ఎదురుదెబ్బలు తగిలాయి. జట్టు స్కోరు 40 పరుగుల వద్ద ఉండగా 4.4వ ఓవర్‌లో ఓపెనర్ సంజూ శాంసన్ 14 పరుగులు చేసి ఔటయ్యాడు. ఆ తర్వాత యువ బ్యాటర్ వైభవ్ సూర్యవంశీ కేవలం నాలుగు పరుగులకే వెనుదిరిగాడు. చాలా రోజుల తర్వాత టీ20లో అవకాశం దక్కించుకున్న వైభవ్ ఆశించిన స్థాయిలో రాణించలేకపోయాడు. మరోవైపు అభిషేక్ శర్మ 27 పరుగులు చేసి జట్టు స్కోరు 56 వద్ద మూడో వికెట్‌గా ఔటయ్యాడు. దీంతో భారత్ 56 పరుగులకే మూడు కీలక వికెట్లు కోల్పోయింది. ఈ దశలో బ్యాటింగ్‌కు వచ్చిన కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ కూడా ఎక్కువసేపు క్రీజులో నిలవలేకపోయాడు. కేవలం ఏడు పరుగులు చేసి వెనుదిరిగాడు. అనంతరం అక్షర్ పటేల్ కూడా ఔటవడంతో టీమిండియా 71 పరుగులకే ఐదు వికెట్లు కోల్పోయి తీవ్ర ఒత్తిడిలో పడింది. భారీ లక్ష్యాన్ని ఛేదించాల్సిన సమయంలో వరుసగా వికెట్లు పడటంతో భారత విజయావకాశాలు సంక్లిష్టంగా మారాయి. ఈ క్లిష్ట పరిస్థితుల్లో తిలక్ వర్మ, నమన్ ధీర్ జట్టును ఆదుకునే బాధ్యత తీసుకున్నారు. ఒకవైపు తిలక్ వర్మ వికెట్లు పడకుండా జాగ్రత్తగా ఆడుతుండగా, మరోవైపు నమన్ ధీర్ దూకుడుగా పరుగులు సాధించాడు. ఇద్దరూ కలిసి భారత ఇన్నింగ్స్‌ను గాడిలో పెట్టేందుకు ప్రయత్నించారు. అయితే 14.5వ ఓవర్‌లో జట్టు స్కోరు 113 పరుగుల వద్ద ఉన్నప్పుడు నమన్ ధీర్ ఔటయ్యాడు. 31 పరుగులు చేసిన అతడు మిచెల్ శాంట్నర్ బౌలింగ్‌లో క్యాచ్ ఇచ్చి వెనుదిరిగాడు. దీంతో భారత్ మరోసారి ఒత్తిడిలో పడింది. నమన్ ధీర్ ఔటైన తర్వాత క్రీజులోకి వచ్చిన నితీశ్ కుమార్ రెడ్డి మ్యాచ్ స్వరూపాన్ని మార్చేశాడు. చివరి ఐదు ఓవర్లలో భారత్ విజయానికి 68 పరుగులు అవసరమైన సమయంలో తిలక్ వర్మతో కలిసి అద్భుతంగా పోరాడాడు. తొలుత నితీశ్ దూకుడుగా బ్యాటింగ్ చేస్తూ పరుగుల వేగాన్ని పెంచాడు. ఆ తర్వాత తిలక్ వర్మ కూడా భారీ షాట్లతో విరుచుకుపడ్డాడు. ఇద్దరు తెలుగు క్రికెటర్లు సమన్వయంతో ఆడుతూ భారత జట్టును లక్ష్యం దిశగా నడిపించారు. ముఖ్యంగా తిలక్ వర్మ ఒత్తిడిని అధిగమించి అద్భుత బ్యాటింగ్ ప్రదర్శించాడు. కేవలం 25 బంతుల్లోనే అర్ధశతకాన్ని పూర్తి చేసి జట్టు విజయానికి బాటలు వేశాడు. మరోవైపు నితీశ్ కుమార్ రెడ్డి కీలక సమయంలో వేగంగా పరుగులు సాధించి ప్రత్యర్థి బౌలర్లపై ఒత్తిడి పెంచాడు. దీంతో చివరి ఓవర్‌లో భారత్ విజయానికి 11 పరుగులు అవసరమయ్యాయి. ఆఖరి ఓవర్‌లోనూ ఇద్దరూ ధైర్యంగా ఆడి లక్ష్యాన్ని పూర్తి చేశారు.

# రాష్ట్రాన్ని రాక్షసులకు వదిలేయాలా?

(మొదటి తరువాయి)



ఎవరికి నేర చరిత్ర ఉందో ప్రజలు అర్థం చేసుకుని వ్యవహరించాలన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో వైసీపీ అరాచకాలను వివరించేందుకు సీఎం క్యాంప్ కార్యాలయంలో శనివారం నిర్వహించిన మీడియా సమావేశంలో చంద్రబాబు మాట్లాడారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో వైసీపీ అరాచకాలను వీడియోల ద్వారా వివరించారు. "అదే హింస, అవే అబద్ధాలు, అవే అరాచకాలు' పేరుతో బుక్‌లెట్ విడుదల చేశారు. అనంతరం ఆయన మాట్లాడారు. "కొందరు చేసే అరాచకాల వల్ల వల్ల రాష్ట్ర ప్రతిష్ఠ మొత్తం దిగజారుతోంది. ఏపీలో పెట్టుబడులు పెట్టాలా..వద్దా.. అని పారిశ్రామికవేత్తలు అనుమానపడే పరిస్థితులను తెచ్చారు. పారిశ్రామికవేత్తలకు నమ్మకం కల్పిచడం కోసం ఎస్క్రో ఖాతా ద్వారా పారిశ్రామిక ప్రోత్సాహకాలిస్తున్నాం. రాష్ట్రాన్ని నంబర్-1 చేయాలనేది మా లక్ష్యం. ఇలాంటి వ్యక్తులు అడ్డుపడితే మా లక్ష్యాన్ని అధిగమించడం కష్టమవుతుంది. అభివృద్ధి కుంటుపడుతుంది. 2019-24 మధ్య ప్రజలు నిద్రలేని రాత్రులు గడిపారు. కనీసం రోడ్లపైకి కూడా రాలేని పరిస్థితి. ఇప్పుడు ఆ పరిస్థితి ఎక్కడా లేదు. ప్రజలంతా ప్రశాంతంగా ఉన్నారు. ఒక్క నిమిషం ఏమరుపాటుగా ఉన్నా, గొడ్డలి పార్టీ వ్యక్తులు నిలువునా ముంచేస్తారు. గతంలో ఇలాంటి వ్యక్తిని రాష్ట్రానికి రానీయకుండా కన్న తండ్రి వైఎస్సే దూరంగా ఉంచేయాలని అనుకున్నారు. రక్త బంధానికి కూడా విలువ ఇవ్వని వ్యక్తి, ఇక ప్రజలకు ఏం విలువ ఇస్తారు..?" అని ప్రశ్నించారు. ఇంకా ఆయన ఏమన్నారంటే..

**వైసీపీ హింసాత్మక రాజకీయాలపై చర్చ జరగాలి**

"రాష్ట్రంలో వైసీపీ నేరమయ రాజకీయాలు చేస్తోంది. స్థానిక సంస్థల ఎన్నికల్లో తొలిరోజు నుంచే వైసీపీ అడ్డంకులు సృష్టించే ప్రయత్నం చేస్తోంది. గొడ్డలి పార్టీకి చెందిన ఓ ఎంపీ వాహనంతో కూటమి కార్యకర్తలను తొక్కించారు. ఆ కారులో మద్యం బాటిళ్లు, మారణాయుధాలు ఉన్నాయి. పుంగనూరు, రాయచోటి, కనిగిరి, దర్శి, కడప, తంబళ్లపల్లె, తిరుపతి ఇలా వేర్వేరు ప్రాంతాల్లో గొడ్డలి పార్టీ నేతలు అరాచకం సృష్టించారు. రాష్ట్రం తగలబడి పోయినా ఫర్వాలేదని, తమ అజెండా నెగ్గాలనే ఆలోచనతోనే వైసీపీ ఇదంతా చేస్తోంది. పంజాబ్ నుంచి కిరాయి ముఠాలను తీసుకువచ్చి భయభ్రాంతులకు గురిచేశారు. కనిగిరిలో నామినేషన్ కేంద్రంలోకి వైసీపీ కార్యకర్తలు దూసుకెళ్లి విధ్వంసం సృష్టించారు. తంబళ్లపల్లెలో జనసేన కార్యాలయంపై దాడి చేశారు. హింసాత్మక రాజకీయాలను ప్రొత్సహిస్తున్న వైసీపీ విధానంపై ప్రజల్లో చర్చ జరగాలి. 'సర్' నిబంధనల ప్రకారమే కూటమి పార్టీలు వ్యవహరిస్తున్నాయి. కానీ దీనికి విరుద్ధంగా వైసీపీ వ్యవహరిస్తోంది. హింస చేస్తోంది వాళ్లే. పిటిషనర్లూ వాళ్లే. ఇదెక్కడి అరాచకం? గతంలో బాబాయిని హత్య చేసి ఫేక్ ప్రచారం చేశారు. ఇప్పుడూ అదే తంతు. కోర్టులకు వెళ్లి తప్పుడు పిటిషన్లు వేస్తూ, క్రిమినల్ లిటిగెంట్లుగా తయారయ్యారు. హైకోర్టుతోపాటు సుప్రీం కోర్టుకూ తప్పుడు సమాచారం ఇచ్చారు."

**అరాచకాలను చూస్తూ వదిలేయలేం**

"ప్రజాస్వామ్యయుతంగా పనిచేయటమే కూటమి పార్టీలకు తెలిసిన విషయం. గొడ్డలి పార్టీ చేసే అరాచకాలను చూస్తూ వదిలివేయలేం. రాష్ట్రవ్యాప్తంగా వైసీపీ దాడులు చేసి వాహనాలు దహనం చేసి హింసాత్మక ఘటనలకు పాల్పడింది. అసత్యాలను పదేపదే చెబుతూ, ప్రజలను నమ్మించే ప్రయత్నం చేస్తున్నారు. కేవలం ప్రెస్ మీట్లు పెట్టడానికే జగన్ బెంగళూరు నుంచి అమరావతికి వచ్చి వెళుతున్నారు. వైసీపీకి చెందిన మాజీ డిప్యూటీ స్పీకర్ స్వయంగా.. రాష్ట్రంలో ప్రశాంతంగా నామినేషన్ల ప్రక్రియ జరిగిందని చెబితే.. వైసీపీ అధ్యక్షుడు మాత్రం అసత్యాలు చెబుతున్నారు. వైసీపీ హయాంలో జరిగిన స్థానిక సంస్థల్లో 24 శాతం ఏకగ్రీవాలు చేసుకున్నారు. అప్పటి ఎస్ఈసీనే భయపెట్టారు. ఎస్ఈసీ ప్రాణభయంతో కేంద్రం నుంచి భద్రత తీసుకోవాల్సిన పరిస్థితి నాడు తీసుకొచ్చారు."

ఎన్నికల్ని అడ్డుకోవడమే జగన్ ఎజెండా

"స్థానిక సంస్థల ఎన్నికలు జరక్కూడదన్నదే వైసీపీ సింగిల్ పాయింట్ ఎజెండా. అందుకే బరితెగించి హింసాత్మక ఘటనలకు తెగబడుతోంది. గతంలోనూ, ఇప్పుడూ తెలుగుదేశం పార్టీ కార్యకర్తలే బాధితులు. మా వాళ్లనే కొట్టి వైసీపీ ఎదురుదాడికి పాల్పడుతోంది. స్థానిక సంస్థల ఎన్నికలను అభివృద్ధికి ఓ అవకాశంగా భావించాం. కానీ గొడ్డలి పార్టీ అభివృద్ధిని కూడా అడ్డుకునే ప్రయత్నం చేస్తోంది. నేరమయ రాజకీయాల్ని ఛేదించటం సవాలే కానీ కష్టం ఏమీ కాదు. ఫ్యాక్షనిజం, నక్సలిజం వంటి సమస్యలను చూశాను. కానీ ఏకంగా ఓ రాజకీయ పార్టీ చేస్తున్న నేరమయ రాజకీయాలతో శాంతిభద్రతల సమస్యలు ఉత్పన్నం కావడం తొలిసారి చూస్తున్నాను.

గత స్థానిక సంస్థల ఎన్నికల్లో పులివెందులలో 33 స్థానాలూ ఏకగ్రీవం కావటం దౌర్జన్యం కాదా? కడపలో 79 శాతం ఎంపీటీసీలు, 76 శాతంజడ్పీటీసీలు ఏకగ్రీవం చేసుకోవడం దౌర్జన్యం కాదా? జగన్ గురివింద తరహాలో మాట్లాడుతున్నారు. హింసకు ప్రతిహింస మా విధానం కాదు. అదే సమయంలో, భయపడి వెన్ను చూపేది లేదు. కుతంత్రాలతో రక్తపాతం సృష్టించాలని ప్రయత్నం చేస్తున్నారు. రాక్షసుల్లా దాడులు చేస్తుంటే, రాష్ట్రాన్ని వారికి వదిలేసి వెళ్లిపోవాలా? రాష్ట్రవ్యాప్తంగా స్వేచ్ఛగా నామినేషన్లు దాఖలయ్యాయి. వైసీపీ వారు కూడా టీడీపీతో పోటీగా నామినేషన్లు వేశారు.

## ఏఐని చూసి భయపడొద్దు

(మొదటి తరువాయి)

సంస్థ భారత ప్రధాన కార్యాలయాన్ని శనివారం కేటీఆర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సాంకేతిక విప్లవాలు తొలుత ఆందోళనలు సృష్టించినప్పటికీ కాలక్రమేణా కొత్త పరిశ్రమలు, ఉద్యోగ అవకాశాలకు మార్గం సుగమం చేశాయని పేర్కొన్నారు. గతంలో బ్యాంకింగ్ రంగంలో కంప్యూటర్ల ప్రవేశాన్ని కూడా వ్యతిరేకించారని, అయితే నేడు అవే వ్యవస్థలు అభివృద్ధికి కీలకంగా మారాయని గుర్తుచేశారు. యువత నిరంతరం కొత్త విషయాలను నేర్చుకోవడంతోపాటు స్కిల్లింగ్, అప్‌స్కిల్లింగ్, రీస్కిల్లింగ్‌పై దృష్టి పెట్టాలని సూచించారు. ప్రభుత్వాలు అందరికీ ఉద్యోగాలు కల్పించడం సాధ్యం కాదని, ప్రైవేట్ రంగం అభివృద్ధి చెందేందుకు అనుకూల వాతావరణాన్ని సృష్టించాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉందన్నారు. మెరుగైన రహదారులు, నిరంతర విద్యుత్, నీటి సరఫరా, రవాణా సౌకర్యాలు, శాంతిభద్రతలు పెట్టుబడులను ఆకర్షించడంలో కీలకమని వివరించారు. వ్యవసాయ రంగంలో సాంకేతికత వినియోగానికి సిరిసిల్లలో చేపట్టిన 'సాగుబాగు' కార్యక్రమాన్ని కేటీఆర్ ఉదాహరణగా ప్రస్తావించారు. పంటలకు సోకే చీడపీడలను ఫొటోల ద్వారా గుర్తించి రైతులకు సూచనలు అందించే విధానాలను ప్రయోగాత్మకంగా అమలు చేసినట్లు తెలిపారు. ఇదే తరహాలో వైద్యం, విద్య, పరిశ్రమలు, ప్రభుత్వ సేవల్లోనూ ఏఐ ఆధారిత పరిష్కారాలను విస్తరించాల్సిన అవసరం ఉందన్నారు. స్విగ్గీ, జొమాటో, జెప్టో, బ్లింకిట్ వంటి డిజిటల్ వేదికలు కొత్త వ్యాపార నమూనాలను అందుబాటులోకి తీసుకొచ్చాయని పేర్కొన్నారు. భవిష్యత్తులో ఏఐ ఆధారిత స్టార్టప్‌లు మరిన్ని ఉపాధి అవకాశాలను సృష్టించగలవని అభిప్రాయపడ్డారు. పరిశ్రమలు, విద్యాసంస్థలు, ప్రభుత్వాలు సమన్వయంతో పనిచేసి యువతను భవిష్యత్తు ఉద్యోగాలకు సిద్ధం చేయాలని కేటీఆర్ సూచించారు.

## నవంబర్ 1న జరిగే ర్యాలీని వాయిదా వేసుకోండి..

న్యూఢిల్లీ:

నవంబర్ 1న ఢిల్లీలోని రాంలీలా మైదానంలో కాంగ్రెస్ సహా ఇండియా బ్లాక్ ఆధ్వర్యంలో భారీ ర్యాలీ చేపట్టనున్న సంగతి తెలిసిందే. అయితే, దీపావళిని దృష్టిలో ఉంచుకుని ఈ ర్యాలీని వాయిదా వేసుకోవాలని ద ఛాంబర్ ఆఫ్ ట్రేడ్ అండ్ ఇండస్ట్రీ (సీటీఐ) కోరింది. లేకపోతే రూ.10,000 కోట్ల వరకు నష్టం వాటిల్లుతుందని వివరించింది. ఈ మేరకు సీటీఐ ఛైర్మన్ బ్రిజేష్ గోయల్ రాహుల్ గాంధీని కోరారు.

## జర్నలిస్టులకు ఇళ్ల స్థలాల కల సాకారం చేస్తాం

(మొదటి తరువాయి)

ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన కొన్ని నెలల్లోనే జర్నలిస్టుల ఇళ్ల స్థలాల అంశంపై చొరవ తీసుకుంది. దాదాపు రెండు దశాబ్దాలుగా ఎదురుచూస్తున్న జర్నలిస్టుల హౌసింగ్ సొసైటీకి 2024 సెప్టెంబర్ 8వ తేదీన రవీంద్ర భారతిలో కార్యక్రమాన్ని నిర్వహించి భూమిని సొసైటీకి అప్పగించడం జరిగిందన్నారు. అనంతరం సుప్రీంకోర్టు తుది ఉత్తర్వుల నేపథ్యంలో మరోసారి న్యాయపరమైన సమస్యలు ఎదురుకావడంతో ఈ అంశానికి శాశ్వత పరిష్కారం చూపాల్సిన అవసరం ఏర్పడిందన్నారు. ఈ పరిస్థితుల్లో గౌరవ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో పాటు సహచర మంత్రులతో పలుమార్లు చర్చించి జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు అందించే అంశంపై సమగ్రంగా సమీక్షించినట్లు మంత్రి వెల్లడించారు. జర్నలిస్టుల సొంతింటి కలను సాకారం చేయాలన్నది మా ప్రభుత్వ సంకల్పం. గతంలో ఎదురైన న్యాయపరమైన సమస్యలు పునరావృతం కాకుండా, చట్టపరమైన చిక్కులు లేని విధంగా, కుటుంబాలతో గౌరవంగా నివసించేందుకు అనువైన ప్రాంతంలో ఇళ్ల స్థలాలు అందించేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నాం. జర్నలిస్టులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. వారి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపేందుకు ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తోందని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి భరోసా ఇచ్చారు. ఇప్పటివరకు కూడా కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనే జర్నలిస్టులకు ఇళ్లస్థలాలు ఇవ్వడం జరిగిందని మరోసారి కాంగ్రెస్ పాలనలోనే ఇస్తామని స్పష్టం చేశారు. ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య వారధిగాంటూ ప్రజాస్వామ్య వ్యవస్థలో కీలక పాత్ర పోషిస్తున్న జర్నలిస్టుల సంక్షేమానికి ప్రజా ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తుందని మంత్రి పేర్కొన్నారు. జర్నలిస్టుల దీర్ఘకాలిక సమస్యలను పరిష్కరించడంతోపాటు, వారికి గౌరవప్రదమైన జీవనానికి అవసరమైన వసతులు కల్పించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. జర్నలిస్టుల సొంతింటి కల నెరవేరేలా, అందరికీ ఆమోదయోగ్యమైన శాశ్వత పరిష్కారం దిశగా ప్రభుత్వం ముందుకు సాగుతోందని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు.

## సంపాదకీయం

# విద్వేషాగ్ని.. యుద్ధాలకు ఇంధనం



సమీప భవిష్యత్తులో ఇప్పటి కంటే భారీ స్థాయిలో యుద్ధాలు జరిగి భూమండలం భస్మీపటలమైపోయే దుర్దినాలు దాపురిస్తున్నాయి. విద్వేషాలు రగిలి- ఉన్మాదమే సామ్రాజ్యవాదమై గర్జిస్తే నింగినంటిన మానవఖ్యాతి మసకబారి మానవత్వం మోడుగా మారదా? దానవత్వం దారితప్పి, అడవినేలే క్రూర మృగాలే అవనినేలే రాజులైతే, మృగత్వమే మానవాళికి శరణ్యమైతే, రాతికాలపు రాక్షసనీతి దాపురించి, సజ్జనకోటిని సంహరిస్తే ఇలాతలంలో ఇసుక రేణువు సైతం విలపించదా? పసిడినేలలు పాడుబడి, బీడులై రోదించవా? నరులే దానవులై, ఆత్మలను సైతం పీక్కుతునే పిశాచాలైతే, నరజాతి యుద్ధపిపాసుల పైశాచిక కోరల్లో బంధీలైతే, మానవ రక్తమాంసాలన్నీ యుద్ధోన్మత్తుల ఉదయ ఫలహారంగా మారితే మానవజాతి సమస్తం చరిత్రపుటల్లో చిరిగిన అధ్యాయంగా మారదా? భోగోళమంతా రుధిర జ్వాలల్లో భస్మీపటలంగా మారదా? మేఘాలు వర్షిస్తే చినుకులే.. ఉన్మాదులు గర్జిస్తే అణ్వాయుధ వర్షమే.. భూమ్యాకాశాల్లో ప్రళయ ప్రకంపనలే. యుద్ధ ఫలితాలు శోక కారకాలు.యుద్ధానంతరం శిథిలమైన నిర్మాణాల పునాదుల్లో మానవ సౌరభం గుభాళిస్తుందా? మానవ కళేబరాల గుట్టల్లో విజయం దాగుంటుందా? క్షతగాత్రుల గుండెల్లో ఆనంద భైరవి రాగం వినిపిస్తుందా? అన్నార్తుల ఆక్రందనల్లో విజయగర్వం చందన లేపనాదులతో పులకించి, మైమరచి వికసిస్తుందా? పలకరిస్తుందా? రుధిరం మరిగిన యుద్ధ పిపాసుల మనసులను మానవతా పరిమళాల మధుర గాత్రం మార్చగలదా? యుద్ధాల వలన అనర్థాలే తప్ప ప్రయోజనం శూన్యమని తెలిసినా, ఎడారిలో నీటి కోసం.. రంగు రాళ్ళలో రత్నాల కోసం వెతకడం కుందేటి కొమ్ముకోసం శ్రమించడమే. యుద్ధాల్లో విజయమైనా, ఓటమైనా అంతిమ ఫలితం వినాశనమే. విధ్వంసంలో విజయాన్ని గాంచి చెలరేగి పోవడం మూర్ఖత్వమే. గతకాలంలో జరిగిన యుద్ధ ఫలితాలు ప్రపంచానికి గాయాలే గేయాలుగా మిగిల్చాయి.విజ్ఞానంలో అజ్ఞానం అవివేకం పెరిగిన విజ్ఞానం ప్రపంచ పరిస్థితులను మెరుగు పరచడానికి నిర్మాణాత్మకంగా ఉపయోగపడాలని ఆశించడంలో తప్పులేదు.కాని అలాంటి ఆశలు అడియాసలై విజ్ఞానమే వినాశనానికి దారితీయడం ఆశనిపాతం లాంటిది. ఎక్కడో వెలిగించి పారేసిన చిన్న అగ్గిరవ్వ పెను విధ్వంసానికి దారితీసే పరిస్థితులు నెలకొంటున్నాయి. ప్రపంచంలో అనేక దేశాలున్నాయి. వీటి మధ్య స్నేహ సంబంధాలు, ద్వైపాక్షిక సంబంధాలు కేవలం వ్యాపారంతోనే ముడిపడి ఉన్నాయి. కొన్ని దేశాల్లో ప్రజాస్వామ్యం, మరికొన్ని దేశాల్లో ప్రజాస్వామ్యం ముసుగులో ఫ్యూడలిజం, క్యాపిటలిజం మూడు పువ్వులు ఆరుకాయలుగా వర్ధిల్లుతుంటే, ఇంకొన్ని చోట్ల నియంతృత్వంలో ప్రజల స్వేచ్ఛ నశించి ఎందుకు జీవిస్తున్నామా అనుకుంటూ జీవశ్ఛవాల్లా బతుకుతున్న ప్రజల ఆక్రందనలు అరణ్య రోదనగా మిగిలిపోతున్నాయి. కొన్ని చోట్ల ప్రజలకు తినడానికి తిండిలేక, తాగడానికి నీరు లేక అలమటిస్తుంటే, మరికొన్ని చోట్ల మాట్లాడే గొంతులను సైతం నులిమేసి, ఎదురు తిరిగితే చంపేసి, తాము బతకడానికి అమాయకుల ప్రాణాలను హరించేసి, వారి రక్తపు ధారలను ఇంధనంగా మలచుకుని నిస్సిగ్గుగా జీవిస్తూ, వీరులుగా చెలామణీ అవుతూ, నరరూప రాక్షసులై ప్రపంచ శాంతికి విఘాతం కలిగిస్తూ, నిత్య మారణాగ్ని హోమంలో చలికాచుకుంటున్న ముష్కరుల అమానుషత్వాన్ని చూస్తున్నాం. ఇలాంటి మానవ రూప దానవులను శిక్షించడం మాని, వారికి ఆశ్రయమిస్తూ, ఆర్థికంగా అండనిస్తూ నరమేధానికి ఊతమిస్తున్న ప్రబుద్ధులనేమనాలి? ఉగ్రవాదులను తయారు చేసి, డ్రగ్స్ వ్యాపారం చేస్తూ, కోట్లు గడిస్తూ, అమాయక యువతను డ్రగ్స్‌తో నిర్వీర్యం చేయడం ఏమి నీతి? అసాంఘిక శక్తులను పెంచి పోషిస్తూ, అమాయకుల ఆయువును అర్ధాయువుగా మారుస్తూ, ఎంతో మంది తల్లిదండ్రుల శోకానికి కారణమవుతున్న ఉగ్రమూకలకు సహకరించే పాకిస్తాన్ వంటి దేశాలను రోగ్ కంట్రీస్‌గా పిలవడంలో తప్పేముంది? అమాయకుల ఉసురుతీస్తున్న ఉగ్రవాదులను పెంచి పోషిస్తూ, చివరికి ఆర్థిక అంతర్గత సమస్యలతో అడుక్కుతినే స్థితికి ప్రజలను తీసుకొచ్చిన పాక్‌ను వెనకేసుకొస్తున్న దేశాలను ఏమనాలి? విద్వేషాలను పెంచి, నీతిని చంపేసి, సత్యాన్ని చెరబట్టి, న్యాయాన్యాయాలను గాలికొదిలేసి, ఉచితానుచితాలను తుంగలో తొక్కి స్వార్థ ప్రయోజనాల కోసం అరాచక,అసాంఘిక శక్తులకు అండగా నిలబడడం దేనికి సంకేతం? పాక్‌ను చావుదెబ్బతీసిన భారత్‌ను ఎదురించలేక నిస్సహాయంగా నిలబడి, భారత్ కాళ్ళ మీద పడి వేడుకుంటే, దయతలచి కాల్పుల విరమణకు అంగీకరిస్తే ట్రంప్ లాంటి నేతలు ఆ క్రెడిట్ తనదే నంటూ ఢాంబికాలు పలకడం విడ్డూరం.బలమైన ఆర్థిక వ్యవస్థగా ఎదగాలని ఆరాటపడుతున్న భారత్ బలమైన అమెరికాతో పోరు మంచిది కాదని మౌనం పాటిస్తున్నదనుకోవాలా? అమెరికా ఒత్తిడికి లొంగిపోయిందనుకోవాలా? భారత్ సహనాన్ని అమెరికా, చైనా, పాక్ దేశాలు అసమర్ధతగా భావించడం కేవలం భావదారిద్ర్యమే.భారత్ కూడా సమాచార మాధ్యమాల విషయంలో దూకుడుగా వ్యవహరించాలి. గంజాయి వనంలో సుగంధం వెల్లివిరియునా? ఉగ్రమూకలను పెంచి పోషిస్తున్న పాక్‌తో ఆయుధ వ్యాపారం చేస్తూ, ట్రేడ్ డీల్ కుదుర్చుకుంటూ, ఆర్థికంగా బలోపేతం కావడానికి పాక్‌తో అంటకాగడం తగునా? ఒక వైపు పశ్చిమాసియాలో యుద్ధం, మరో వైపు రష్యా- ఉక్రెయిన్ మధ్య యుద్ధం, ఇంకో వైపు టారిఫ్‌ల గోల.. ఇలాంటి పరిస్థితుల్లో భారత్ వంటి దేశాలు తమకు ఇష్టమైన దేశాలతో ట్రేడ్ డీల్ కుదుర్చుకోవడం నేరమా? రష్యా నుండి చమురు కొనుగోలు చేయడం తప్పిదమా? ఒక వైపు పాకిస్తాన్ టర్కీ, సౌదీలతో మక్కా ఒప్పందం కుదుర్చుకుని, మరో వైపు ఇండోనేషియా, ఖతార్, తుర్కియేలతో 'బదర్' డిఫెన్స్ డీల్ కుదుర్చుకుని భారత్‌ను ఇబ్బంది పెట్టాలని ప్రయత్నిస్తుంటే, భారత్ తన రక్షణ అవసరాలకు, వాణిజ్య అవసరాలకు రష్యా, ఇజ్రాయెల్ వంటి దేశాలతో సన్నిహితంగా మెలగడం తప్పెలా అవుతుంది?రష్యా వద్ద చమురు కొంటున్న భారత్‌ను టారిఫ్ లతో ఇబ్బందులు పెట్టడం, తనకు అవసరమైనప్పుడల్లా ఇంధన కాల్పుల విరమణ అంటూ మినహాయింపులివ్వడం ద్వంద్వ వైఖరి కాదా? అమెరికా పెద్ద మనిషి ముసుగేసుకుని, పెద్దన్నలా చెలామణీ కావడం తగని పని. ప్రపంచ దేశాల మధ్య తలెత్తిన ఎన్నో సమస్యలకు దారిచూపి, ఎన్నో సంక్షోభాలను తన మధ్యవర్తిత్వంతో సమసిపోయేలా చేసిన సుదీర్ఘ చరిత్ర గల అమెరికా నేడు ట్రంప్ హయాంలో ఇంతగా దిగజారి పోవడం బాధాకరం జార్జి వాషింగ్టన్, జెఫర్సన్, అబ్రహాం లింకన్, కెనడీ, ఒబామా లాంటి మహామహులు ఏలిన అమెరికా ట్రంప్ ఏలుబడిలో అపఖ్యాతి పాలై చరిత్ర పుటల్లో హీనంగా మిగిలే దుర్దినాలకు దగ్గర దశలో ఉంది. పాక్ తాను భారత్‌ను ఢీకొట్టి ఓడిపోయినా గెలిచినట్టు గోబెల్స్ ప్రచారం చేస్తున్నది.పాక్ అణ్వాయుధ పాటవం ప్రపంచానికి ప్రమాదం. వచ్చే ఏడాది ప్రారంభంలో అబుదాబీలో జరిగే చర్చల్లో రష్యా- ఉక్రెయిన్ల మధ్య యుద్ధానికి ముగింపు పలకాలి.

# రూపాయి వాణిజ్యంతో భారత్ కొత్త వ్యూహం



ప్రపంచ వాణిజ్యంలో అమెరికన్ డాలర్ ఆధిపత్యం కొనసాగుతున్న వేళ భారత్ రూపాయి లేదా స్థానిక కరెన్సీల్లో వాణిజ్య చెల్లింపులను విస్తరించే వ్యూహాన్ని ముందుకు తీసుకెళ్తోంది. విదేశీ మార్పిడిద్రవ్య కొరతను ఎదుర్కొంటున్న భాగస్వామ్య దేశాలతో స్థానిక కరెన్సీల్లో వాణిజ్యం కొనసాగించడం ద్వారా వాటికి అనవసరమైన ఆంక్షలు అందుబాటులో ఉండడంతో పాటు, అంతర్జాతీయ వాణిజ్యంలో రూపాయి వినియోగాన్ని పెంచడం దీని ప్రధాన ఉద్దేశం. ఇది డాలర్‌పై ఆధారపడటాన్ని తగ్గించడం, రూపాయిని అంతర్జాతీయరీత్యా చేయడం, భారత ఆర్థికదేహాన్ని బలోపేతం చేయడం వంటి విస్తృత లక్ష్యాలతో ముడిపడి ఉంది. సాధారణంగా అంతర్జాతీయ వాణిజ్యంలో డాలర్ వంటి బలమైన కరెన్సీలను మధ్యవర్తి కరెన్సీగా ఉపయోగిస్తారు. అయితే విదేశీ మారకద్రవ్య నిల్వలు తగ్గిపోయిన దేశాలకు డాలర్లను సమకూర్చుకోవడం కష్టమవుతుంది. ఫలితంగా అవసరమైన వస్తువులు కొనుగోలు చేయగలిగినా దిగుమతులు నిలిచిపోయి పరిస్థితి ఏర్పడుతుంది. ఇలాంటి సమయంలో భారత్ రూపాయి లేదా భాగస్వామ్య దేశాల స్థానిక కరెన్సీల్లో చెల్లింపులు జరపడం అనేది ఒక ఆశాజనకమైన ప్రత్యామ్నాయ మార్గాన్ని అందిస్తోంది. అయితే దీని ద్వారా డాలర్ అవసరం పూర్తిగా తగ్గిపోతుందని కాదు. చమురు, ముడి సరుకులు, సాంకేతిక పరికరాలు వంటి కీలక దిగుమతులకు భారత్‌కు ఇప్పటికీ డాలర్ అవసరం ఉంది. అందువల్ల లక్ష్యం డాలర్‌ను తోసిపుచ్చడం కంటే, ఒకే కరెన్సీపై అధిక ఆధారపడకుండా ప్రత్యామ్నాయ చెల్లింపు మార్గాలను పెంచుకోవడం. రూపాయి అంతర్జాతీయకరణ ఈ వ్యూహంలో మరో కీలక అంశం. ఇతర దేశాలు భారత్‌తో వాణిజ్యంలో రూపాయిని స్వీకరించడం పెరిగితే, దాని అంతర్జాతీయ వినియోగం విస్తరిస్తుంది. అయితే విదేశీ దేశాలు పొందిన రూపాయిని తిరిగి ఎలా ఉపయోగించాలి అన్నది కీలక ప్రశ్న. భారత్ నుండి వస్తువులు కొనుగోలు చేయడం, భారత ఆర్థిక మార్కెట్లలో పెట్టుబడులు పెట్టడం లేదా ఇతర లావాదేవీల్లో రూపాయిని ఉపయోగించే అవకాశాలు పెరిగితేనే దానికి డిమాండ్ స్థిరంగా పెరుగుతుంది. అందుకే రూపాయి అంతర్జాతీయకరణ కేవలం చెల్లింపు వ్యవస్థ మార్పుతో పూర్తయ్యే ప్రక్రియ కాదు. విదేశీ మారకద్రవ్య కొరతతో ఉన్న దేశాలకు స్థానిక కరెన్సీల్లో వాణిజ్యం ఒక ఆర్థిక భద్రతా మార్గంగా మారవచ్చు. డాలర్ నిల్వలు తగ్గిపోయినా ఆహారం, మందులు, ఇంధనం, పారిశ్రామిక వస్తువులు వంటి అవసరమైన దిగుమతులను కొనసాగించే అవకాశం వారికి లభిస్తుంది. ముఖ్యంగా రుణ సంక్షోభాలు, చెల్లింపుల సమస్యలు లేదా కరెన్సీ ఒత్తిళ్లను ఎదుర్కొంటున్న అభివృద్ధి చెందుతున్న దేశాలకు ఇది ప్రత్యామ్నాయ వాణిజ్య మార్గాన్ని అందించగలదు. ఈ పరిణామం ప్రపంచ ఆర్థిక వ్యవస్థపై కూడా ప్రభావం చూపవచ్చు. దశాబ్దాలుగా వాణిజ్యం, అంతర్జాతీయ రుణాలు, కమోడిటీ మార్కెట్లు, విదేశీ మారక నిల్వల్లో డాలర్ కీలక పాత్ర పోషించింది. అయితే భారత్‌తో పాటు ఇతర పెద్ద అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థలు స్థానిక కరెన్సీల్లో వాణిజ్యాన్ని పెంచుకుంటే, ప్రపంచ ఆర్థిక వ్యవస్థ క్రమంగా బహుళ కరెన్సీ వ్యవస్థ వైపు కదిలే అవకాశం ఉంది. అంటే డాలర్ స్థానాన్ని ఒక్కసారిగా మరో కరెన్సీ భర్తీ చేయడం కాదు.. డాలర్‌తో పాటు యూరో, యువాన్, రూపాయి, యెన్ వంటి కరెన్సీలకు ప్రాంతీయ, ద్వైపాక్షిక వాణిజ్యంలో మరింత ప్రాధాన్యం రావచ్చు. అందుకే భారత్ విధానాన్ని పూర్తిగా 'డాలర్‌పై ఆధారపడటాన్ని పూర్తిగా తగ్గించడం కంటే, కరెన్సీ ఆధారాలను వివిధ్యం చేసుకునే వ్యూహంగా చూడటం సముచితం.." డాలర్‌ను వదిలేయడం భారత్ లక్ష్యం కాదు; ఒకే కరెన్సీపై ఆధారపడకుండా ప్రత్యామ్నాయ మార్గాలను పెంచుకోవడం ప్రధాన ఉద్దేశం. భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు, ఆర్థిక ఆంక్షలు లేదా అంతర్జాతీయ చెల్లింపుల వ్యవస్థలో అంతరాయాలు ఏర్పడినప్పుడు ఈ ప్రత్యామ్నాయాలు భారత్‌కు కొంత ఆర్థిక రక్షణ కల్పించవచ్చు. రూపాయి వాణిజ్యం పెరగడం ఆర్థిక దేహానికి కూడా బలం చేకూర్చవచ్చు. భారత్‌తో రూపాయిలో వాణిజ్యం చేసే దేశాలతో బ్యాంకింగ్ సంబంధాలు, చెల్లింపు వ్యవస్థలు, పెట్టుబడులు మరింత అనుసంధానమయ్యే అవకాశం ఉంది. యూపీఐ వంటి భారతీయ డిజిటల్ చెల్లింపు వ్యవస్థలను ఇతర దేశాలతో అనుసంధానించే ప్రయత్నాలు కూడా ఇదే విస్తృత వ్యూహంలో భాగంగా చూడవచ్చు. స్థానిక కరెన్సీ వాణిజ్యం, వేగవంతమైన సరిహద్దు చెల్లింపులు, డిజిటల్ చెల్లింపులు కలిసి పనిచేస్తే భారతదేశానికి ప్రాంతీయ ఆర్థిక ప్రభావం మరింత పెరగవచ్చు. అయితే ఈ మార్పుకు సవాళ్లు ఉన్నాయి. రూపాయి విలువలో అధిక అస్థిరత ఉంటే విదేశీ వ్యాపారులు దానిని స్వీకరించడానికి వెనుకడవచ్చు. భారత ఆర్థిక మార్కెట్లు ఇంకా డాలర్ లేదా యూరో మార్కెట్ల స్థాయిలో అంతర్జాతీయ లోతును సాధించాల్సి ఉంది. అలాగే చమురు వంటి కీలక దిగుమతులకు భారత్‌కు డాలర్ అవసరం కొనసాగుతుంది. విదేశీ దేశాలు పెద్ద మొత్తంలో రూపాయిని స్వీకరించిన తర్వాత దానిని పెట్టుబడులు లేదా ఇతర వాణిజ్య అవసరాలకు ఉపయోగించుకునే అవకాశాలు పరిమితంగా ఉంటే, రూపాయి ఆధారిత వాణిజ్యం విస్తరించడం కూడా కష్టమే. భారత్ ముందుకు తీసుకెళ్తున్న వ్యూహం దీర్ఘకాలికమైనది. ద్వైపాక్షిక వాణిజ్యంలో స్థానిక కరెన్సీల వినియోగం పెంచడం, బ్యాంకింగ్-చెల్లింపు వ్యవస్థలను అనుసంధానించడం, రూపాయిలో పెట్టుబడులను మరియు ఆర్థిక మార్కెట్లను వినియోగాన్ని పెంచడం ద్వారా దాని అంతర్జాతీయ పాత్రను బలోపేతం చేయాలన్నది దీని విస్తృత లక్ష్యంగా కనిపిస్తోంది. ఈ ప్రక్రియ విజయవంతం కావాలంటే భారత ఆర్థిక వ్యవస్థ స్థిరత్వం, బలమైన బ్యాంకింగ్ వ్యవస్థ, లోతైన మూలధన మార్కెట్లు, స్థిరమైన ద్రవ్య విధానం, పెట్టుబడిదారుల విశ్వాసం కీలకం. మొత్తంగా చూస్తే, భారత్ చేపడుతున్న రూపాయి వాణిజ్య వ్యూహం డాలర్‌ను ఓడించే తక్షణ ప్రయత్నం కాదు. విదేశీ కరెన్సీ కొరతతో ఉన్న దేశాలకు వాణిజ్య ప్రత్యామ్నాయం కల్పించడం, భారత ఎగుమతులకు కొత్త మార్కెట్లు తేవడం, రూపాయి అంతర్జాతీయ వినియోగాన్ని పెంచడం, డాలర్‌పై ఆధారపడే రిస్క్‌ను తగ్గించడం దీని ప్రధాన లక్ష్యాలు. దీర్ఘకాలంలో ఈ వ్యూహం విజయవంతమైతే ప్రపంచ ఆర్థిక వ్యవస్థ డాలర్ అధిపత్యం నుంచి ఒక్కసారిగా బయటపడకపోయినా, అనేక దేశాలు తమ ప్రాంతీయ, ద్వైపాక్షిక వాణిజ్యంలో కీలక పాత్ర పోషించే బహుళ కరెన్సీ వ్యవస్థ వైపు కదిలే అవకాశం ఉంది. భారతదేశానికి ఇది రూపాయి వినియోగాన్ని పెంచే విధానం మాత్రమే కాకుండా, ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో తన స్థానాన్ని క్రమంగా పెంచుకునే వ్యూహాత్మక అడుగుగా మారవచ్చు.

# ప్రభుత్వరంగ బ్యాంకుల భవిష్యత్తు ప్రశ్నార్థకమా?




అక్టోబర్ 14న ఐడీబీఐ బ్యాంకులో కేంద్రప్రభుత్వం, ఎల్ఐసీల వాటాల్లో కొంత భాగాన్ని విక్రయించేందుకు కెనడాకు చెందిన ఫెయిర్‌ఫాక్స్ ఫైనాన్షియల్ హోల్డింగ్స్ అను బంధ సంస్థను వ్యూహాత్మక కొనుగోలుదారుగా కేంద్ర మంత్రివర్గ ఆర్థిక వ్యవహారాల కమిటీ ఆమోదించింది. ఈ లావాదేవీ పూర్తయితే, బ్యాంకులో కేంద్ర ప్రభుత్వ వాటా 15 శాతానికి, ఎల్ఐసీ వాటా 19 శాతానికి తగ్గడంతో పాటు, బ్యాంకు నిర్వహణ నియంత్రణ ఫెయిర్‌ఫాక్స్‌కు దక్కే అవకాశం ఉంది. ఈ పరిణామం నేపథ్యంలో, 'బ్యాంకుల సమర్థతకు ప్రైవేటు యాజమాన్యమే గీటురాయా? సమర్థవంతమైన నిర్వహణ, పారదర్శకమైన పాలన, జవాబుదారీతనం ఉంటే ప్రభుత్వరంగ బ్యాంకులు కూడా అత్యుత్తమ ఫలితాలను సాధించగలవా?' అనే ప్రశ్నలు మరోసారి తలెత్తుతున్నాయి. వీటికి సమాధానాలు వెతకాలంటే ప్రభుత్వరంగ బ్యాంకుల చరిత్రను, గత దశాబ్దంలో అవి సాధించిన పురోగతిని, దేశ ఆర్థిక వ్యవస్థలో అవి పోషిస్తున్న కీలక పాత్రను సమగ్రంగా పరిశీలించాలి. 1969లో తొలి విడతగా 14 బ్యాంకులు, 1980లో మరో ఆరు బ్యాంకుల జాతీయకరణ జరిగినప్పటి నుంచి భారత దేశ ఆర్థిక, సామాజిక వికాసాన్ని ప్రభుత్వరంగ బ్యాంకులు ప్రభావితం చేసినంతగా మరే ఇతర సంస్థ గానీ, వ్యవస్థ గానీ ప్రభావితం చేయలేదంటే అతిశయోక్తి కాదు. అప్పటి నుంచి ప్రజాజీవనంతో అనుసంధానమైన వివిధ రంగాల్లో జాతీయ బ్యాంకులు పోషించిన పాత్ర మరచిపోలేనిది. 'ఫైనాన్షియల్ ఇన్‌క్లూజన్' అనే భావన ఇంతగా ప్రాచుర్యం పొందడానికి దశాబ్దాల ముందుగానే, ఆ లక్ష్యం ప్రభుత్వరంగ బ్యాంకుల దైనందిన కార్యాచరణల్లో ఒద్దికగా ఇమిడిపోయింది. సాధారణ జనజీవన స్రవంతికి దూరంగా ఉన్న ప్రాంతాలకు, వర్గాలకు బ్యాంకింగ్ సేవలను విస్తరించడం, వ్యవసాయ రంగానికి ఊతమివ్వడం, చిన్న పరిశ్రమలకు అండగా నిలవడం, ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలను అట్టడుగు వర్గాలకు చేర్చడం వంటి అనేక జాతీయ నిర్మాణ కార్యక్రమాల్లో ఇవి అగ్రగాములుగా నిలిచాయి. ప్రస్తుత పనితీరు విషయానికి వస్తే, 2015-16 ఆర్థిక సంవత్సరంలో ప్రభుత్వరంగ బ్యాంకులు సమష్టిగా సుమారు రూ. 18,000 కోట్ల నష్టాలను నమోదు చేయగా, 2025-26 ఆర్థిక సంవత్సరంలో రికార్డు స్థాయిలో రూ. 1.98 లక్షల కోట్ల నికర లాభాలను ఆర్జించాయి. 2015-16 నాటికి సుమారు 9 శాతంగా ఉన్న స్థూల నిరర్థక ఆస్తుల నిష్పత్తి 2026 మార్చి నాటికి 1.93 శాతానికి తగ్గింది. ఇదే కాలంలో మూలధన పర్యాప్తత నిష్పత్తి సుమారు 11.5 శాతం నుండి 16.6 శాతానికి పెరిగింది. సాంకేతికత ఆధునికీకరణ, వినియోగదారుల సేవల మెరుగూదల, రిస్క్ మేనేజ్‌మెంట్ సామర్థ్యాల పటిష్టత వంటి అంశాల్లోనూ ఇవి ప్రైవేటు బ్యాంకులతో పోటీపడుతున్నాయి. గత దశాబ్దంలో ఎదురైన బ్యాంకింగ్ సంక్షోభం తర్వాత ప్రభుత్వరంగ బ్యాంకులు తమ వ్యాపార విస్తరణ కోసం ప్రభుత్వం నుండి తాజా మూలధన సహాయాన్ని ఆశించాల్సిన పరిస్థితి నుంచి బయటపడ్డాయి. ఇంతేగాక, దేశ బ్యాంకింగ్ వ్యవస్థలోని మొత్తం డిపాజిట్లు, రుణాలు, ఆస్తుల్లో ఇప్పటికీ సుమారు 56-58 శాతం వాటాను ప్రభుత్వరంగ బ్యాంకులే కలిగి ఉన్నాయి. 58 కోట్లకు పైబడిన ప్రధానమంత్రి జన్ ధన్ ఖాతాల్లో దాదాపు నాలుగుంట మూడు వంతుల ఖాతాలను నిర్వహిస్తున్నాయి. లాభదాయకతకే పరిమితం కాకుండా, విస్తృత ప్రజావళికి బ్యాంకింగ్ సేవలను అందించడంలో ఇవి పోషిస్తున్న పాత్రకు ఇది నిదర్శనం. అదే సమయంలో యూపీఐ, మొబైల్, ఇంటర్నెట్ బ్యాంకింగ్ వంటి డిజిటల్ సేవల విస్తరణలోనూ ఇవి ప్రైవేటు బ్యాంకులతో సమానంగా పోటీపడుతూ కోట్లాది మంది వినియోగదారులకు నిరంతరాయంగా సేవలందిస్తున్నాయి. ఈ పునరుజ్జీవనానికి అనేక వ్యవస్థాగత కారణాలు ఉన్నప్పటికీ, మార్పును క్షేత్రస్థాయిలో వినియోగదారుల ముంగిటకు చేర్చిన లక్షలాది మంది ఉద్యోగులు, అధికారుల పాత్రను విస్మరించలేం. శాఖల విస్తరణ నుంచి కంప్యూటరీకరణ వరకు, కోర్ బ్యాంకింగ్ నుంచి డిజిటల్ బ్యాంకింగ్ వరకు, జన్ ధన్ ఖాతాల ప్రారంభం, ప్రత్యక్ష నగదు బదిలీ వ్యవస్థ అమలు, నోట్ల రద్దు, కోవిడ్-19 సమయంలో ప్రత్యేక సేవల నిర్వహణ, భారీ బ్యాంకుల విలీన ప్రక్రియలు వంటి అసాధారణ పరిస్థితుల్లోనూ వారు ప్రజలకు తోడుగా నిలిచారు. తీవ్రమైన సిబ్బంది కొరత, పెరుగుతున్న వ్యాపార పరిమాణం, వేగంగా మారుతున్న సాంకేతికతలు, కఠినమైన నియంత్రణల మధ్య కూడా సేవలను అందించారు. ప్రైవేటు బ్యాంకుల నిర్వహణలో సమస్యలు తలెత్తినప్పుడు కూడా ప్రభుత్వరంగ బ్యాంకులు వ్యవస్థాగత స్థిరత్వాన్ని కాపాడటంలో కీలక పాత్ర పోషించాయి. 2004లో గ్లోబల్ ట్రస్ట్ బ్యాంకు సంక్షోభం తలెత్తినప్పుడు, రిజర్వ్ బ్యాంకు చొరవతో అప్పట్లో ప్రభుత్వరంగానికి చెందిన బ్యాంక్ ఆఫ్ కామర్స్ ఆ బ్యాంకును విలీనం చేసుకోవడం ద్వారా ఖాతాదారుల ప్రయోజనాలను కాపాడటానికి, బ్యాంకింగ్ వ్యవస్థపై ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టడానికి తోడ్పడింది. మరోవైపు, ఇటీవల కాలంలో భారీ మోసంతో సంక్షోభాన్ని ఎదుర్కొన్న పంజాబ్ నేషనల్ బ్యాంకు తన కార్యకలాపాలను కొనసాగించి, క్రమంగా ఆ పరిస్థితి నుంచి కోలుకుంది. ప్రభుత్వరంగ బ్యాంకుల పనితీరును కేవలం లాభాలు, డివిడెండ్లు, మూలధన నిష్పత్తులు వంటి ఆర్థిక సూచికలతో మాత్రమే కొలవడం సముచితం కాదు. ఎందుకంటే వాటి ప్రాథమిక వాణిజ్య పనితీరును దాటి దేశాభివృద్ధికి ఉద్దేశించిన ఆర్థిక, సామాజిక లక్ష్యాలతో ముడిపడి ఉంది. భారతదేశం 'వికసిత్ భారత్' లక్ష్యాన్ని సాధించే దిశగా అడుగులు వేస్తున్న ఈ సమయంలో, మౌలిక సదుపాయాలు, తయారీ రంగం, హరిత ఇంధనం, డిజిటల్ పరివర్తన, గ్రామీణాభివృద్ధి వంటి రంగాలకు భారీ మొత్తంలో దీర్ఘకాలిక మూలధనం అవసరమవుతుంది. ఆర్థిక సమగ్రత, సామాజిక భద్రత, ప్రాంతీయ సమతుల అభివృద్ధి వంటి జాతీయ లక్ష్యాలను కూడా సమాంతరంగా సాధించాల్సి ఉంటుంది. అందువల్ల విధానపరమైన చర్చను 'ప్రభుత్వరంగ బ్యాంకులను ప్రైవేటీకరించాలా వద్దా?' అనే పరిమిత ప్రశ్న చుట్టూ కాకుండా, వాటి ప్రత్యేక బలాలు దేశ ఆర్థిక పరివర్తనకు ఎలా వినియోగించుకోవాలనే దానిపై కేంద్రీకరించాలి. సంగ్రహంగా చెప్పాలంటే, ప్రైవేటీకరణ ఒక్కటే బ్యాంకింగ్ రంగంలోని సమస్యలన్నింటికీ సర్వరోగ నివారిణి కాదు. ప్రభుత్వరంగ బ్యాంకులు ఇప్పటికీ సాధించిన ఆర్థిక పురోగతిని, ప్రణాళికతో వాటి పాత్రను నిలబెట్టుకుంటూనే, నిర్వహణ సామర్థ్యాన్ని, పారదర్శకతను, జవాబుదారీతనాన్ని మరింత బలోపేతం చేయడం వికసిత్ భారత్ లక్ష్య సాధనకు అవసరం.

మార్నింగ్ కాఫీ విత్ హాట్ న్యూస్‌తో...! మీ
డ్రీమ్ టైమ్స్
తెలుగు దిన పత్రిక
DREAM TIMES DAILY NEWS PAPER

ఆదివారం
25-10-2026

Ananthapuram, Kurnool, Kadapa
అనంతపురం, కర్నూల్,కడప

# నామినేషన్ల పరిశీలనకు పటిష్ట పోలీసు బందోబస్తు

**నంద్యాల, సిరివెళ్ల, రుద్రవరం, ఆళ్లగడ్డ కేంద్రాలను తనిఖీ చేసిన ఎస్పీ సునీల్ షోరాణ్**







**నంద్యాల క్రైమ్ । డ్రీమ్ టైమ్స్ అక్టోబర్ 24, 2026.**
నంద్యాల: నంద్యాల జిల్లా వ్యాప్తంగా ప్రాదేశిక ఎన్నికల నామినేషన్ల పరిశీలన ప్రక్రియ ప్రశాంతంగా, సజావుగా జరిగేలా జిల్లా పోలీసు శాఖ పటిష్ట భద్రతా ఏర్పాట్లు చేపట్టింది. జిల్లా ఎస్పీ శ్రీ సునీల్ షోరాణ్, ఐపీఎస్ ఆదేశాల మేరకు నామినేషన్ల పరిశీలన కేంద్రాలు, సంబంధిత కార్యాలయాల వద్ద పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. ఈ నేపథ్యంలో జిల్లా ఎస్పీ నంద్యాల, సిరివెళ్ల, రుద్రవరం, ఆళ్లగడ్డ ప్రాంతాల్లోని నామినేషన్ల పరిశీలన కేంద్రాలను స్వయంగా సందర్శించి భద్రతా ఏర్పాట్లను తనిఖీ చేశారు. విధుల్లో ఉన్న పోలీసు అధికారులు, సిబ్బందికి పలు సూచనలు జారీ చేశారు. నామినేషన్ల పరిశీలన సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని ఎస్పీ ఆదేశించారు. కేంద్రాల పరిసరాల్లో అనధికార వ్యక్తులు గుమికూడకుండా అప్రమత్తంగా ఉండాలని, ఎన్నికల నియమావళిని పక్కాగా అమలు చేయాలని సూచించారు. పరిశీలన ప్రక్రియకు ఎలాంటి ఆటంకాలు కలగకుండా నిరంతరం పర్యవేక్షణ కొనసాగించాలని స్పష్టం చేశారు. అభ్యర్థులు, ఎన్నికల అధికారులు తమ విధులను ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకునేలా అవసరమైన భద్రత కల్పించాలని తెలిపారు. ఎన్నికల నిబంధనలను ఉల్లంఘించే వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని ఎస్పీ హెచ్చరించారు. ఈ తనిఖీల్లో సబ్ కలెక్టర్ మనీషా, స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ రామాంజనేయుడు, సంబంధిత పోలీసు అధికారులు పాల్గొన్నారు.

# దివ్యాంగులకు, వృద్ధులకు మౌలిక సదుపాయాలు కల్పించాలి.



**నంద్యాల డ్రీమ్ టైమ్స్ జిల్లా స్టాపర్.**
జరగబోవు స్థానిక సంస్థల ఎన్నికల సందర్భంగా జిల్లాస్థాయి ఎన్నికల కమిటీలలో విభిన్న ప్రతిభావంతులకు మరియు వారి సంఘాల ప్రతినిధులకు సభ్యత్వం కల్పించి, విభిన్న ప్రతిభావంతులకు వృద్ధులకు ప్రత్యేక క్యూలైన్లు ఏర్పాటు చేయాలని డిసేబుల్డ్ రైట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఏపీ వ్యవస్థాపక అధ్యక్షులు డిపి మస్తాన్ వలి కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... దివ్యాంగులకు అనుకూలంగా .అన్ని పోలింగ్ కేంద్రాలలో ర్యాంపులు,వీల్ చైర్లు, సంజ్ఞా భాష, రియల్లీ హెల్ప్ డెస్క్, ప్రాధాన్యత క్యూ, స్క్రాబ్ వంటి సౌకర్యాలు కల్పించాలని, ఎండ తీవ్రతను ఎక్కువగా ఉండడంతో అన్ని పోలింగ్ కేంద్రాల వద్ద దివ్యాంగులకు వృద్ధులకు సామియాలు వేయించి, మంచినీటి సౌకర్యం కల్పించి వారికి వీల్ చైర్స్ ను ఏర్పాటు, ప్రత్యేకంగా క్యూలైన్ ఏర్పాటు చేసి, ఎలాంటి ఇబ్బందులు లేకుండా స్వచ్ఛందంగా ఓటు హక్కు వినియోగించుకోనేలా చర్యలు తీసుకోవాలని డిసేబుల్డ్ రైట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఏపీ ఆధ్వర్యంలో నంద్యాల మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ కళ్యాణి బాయి కి వినతిపత్రం అందించడం జరిగినది. వృద్ధులకు దివ్యాంగులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకుంటామని ఆమె హామీ ఇవ్వడం జరిగినది. ఈ కార్యక్రమంలో డిసేబుల్డ్ రైట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు కిరణ్ కుమార్, నబి రసూల్,వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

# 51వ వార్డు అక్రమాలపై సమగ్ర విచారణ జరపాలి--సిపిఐ డిమాండ్ .

**-51 వ వార్డులో బుగ్గ రాముడు కోడలు నామినేషన్ అనర్హతగా ప్రకటించి, రి నామినేషన్ నిర్వహించాలి.**

**-51 వార్డులో ఫోర్జరీ సంతకాలను అనుమతించిన నంద్యాల మున్సిపల్ కమిషనర్ ను శాశ్వతంగా రిమూవ్ చేయాలి.**

**-జిల్లా కార్యదర్శి రంగా నాయుడు .**




**నంద్యాల డ్రీమ్ టైమ్స్ జిల్లా స్టాపర్.**
నంద్యాల పట్టణ మున్సిపల్ ఎన్నికల్లో అధికార టీడీపీ తీవ్ర అక్రమాలకు పాల్పడుతోందని సిపిఐ జిల్లా కార్యదర్శి ఎన్. రంగనాయుడు ధ్వజమెత్తారు. శనివారం నంద్యాల సిపిఐ జిల్లా కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 51వ వార్డు వైఎస్సార్సీపీ అభ్యర్థి నామినేషన్ ఉపసంహరించుకోకపోయినా, టీడీపీ నాయకుడు బుగ్గ రాముడు తప్పుడు పత్రాలతో ఏకగ్రీవమైందంటూ అసత్య ప్రచారం చేస్తున్నారన్నారు. అక్రమాలకు పాల్పడుతున్న బుగ్గ రాముడును టీడీపీ నుంచి సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. సిపిఐ జాతీయ పార్టీ అని, 51వ వార్డు అభ్యర్థికి బి-ఫామ్ ఇచ్చామని తెలిపారు. పార్టీకి సమాచారం లేకుండా నామినేషన్ ఉపసంహరించుకున్నందున అభ్యర్థి రహేనా, శాఖ కార్యదర్శి హుస్సేన్ సాను పార్టీ నుంచి తొలగిస్తున్నట్లు ప్రకటించారు. బుగ్గ రాముడు అభ్యర్థులను భయభ్రాంతులకు గురిచేసి విత్‌డ్రా చేయించారని ఆరోపించారు. అభ్యర్థుల ప్రమేయం లేకుండా జరిగిన విత్‌డ్రాలపై సమగ్ర విచారణ జరిపి కఠిన చర్యలు తీసుకోవాలని, మున్సిపల్ కమిషనర్‌ను తక్షణమే బదిలీ చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో సిపిఐ పట్టణ కార్యదర్శి ప్రసాద్, సహాయ కార్యదర్శి లక్ష్మీదేవి, సీనియర్ నాయకులు సంజీవులు, నాగరాముడు, రైతు సంఘం నాయకులు సుబ్బారెడ్డి, సోమన్న తదితరులు పాల్గొన్నారు.

## నంద్యాల గడ్డపై శిల్పా రవిరెడ్డి రౌద్రప్రసంగం...

# కూటమి నేతల అరాచకాలపై నిప్పులు





**-"నంద్యాల అభివృద్ధి అంటేనే వైఎస్సార్‌సీపీ..**

**-ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్న కూటమికి ఓటుతోనే తగిన బుద్ధి చెప్పాలని పిలుపు నిచ్చిన - మాజీ ఎమ్మెల్యే శిల్పా రవిచంద్ర కిషోర్ రెడ్డి.**

**నంద్యాల డ్రీమ్ టైమ్స్ జిల్లా స్టాపర్ .**
నంద్యాల పురపాలిక పోరు రసవత్తరంగా మారుతున్న వేళ... మాజీ ఎమ్మెల్యే శిల్పా రవిచంద్ర కిషోర్ రెడ్డి ప్రచార పర్వంలో నిప్పులు చెరిగారు! పట్టణ అభివృద్ధే ధ్యేయంగా వైఎస్సార్‌సీపీ శ్రేణులతో కలిసి హోరెత్తించిన ఆయన, కూటమి నేతల అవినీతి, అరాచకాలు, ప్రజా వ్యతిరేక విధానాలపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. వైఎస్సార్‌సీపీ హయాంలో జరిగిన అభివృద్ధిని, నేడు కూటమి నాయకులు సాగిస్తున్న దుర్మార్గపు పాలనను ఏకిపారేశారు. నంద్యాల మున్సిపాలిటీని మళ్లీ ప్రగతి పథంలో నడిపించాలంటే వైఎస్సార్‌సీపీని గెలిపించి తీరాల్సిందేనని శిల్పా రవిరెడ్డి పిలుపునిచ్చారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా పట్టణంలోని కీలక వార్డులలో ఆయన పర్యటించారు. చైర్మన్ అభ్యర్థి అమీర్ బాషాతో పాటు ఆయా వార్డుల కౌన్సిలర్ అభ్యర్థులను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు:18 వార్డు వాసగిరి సువర్ణ,21వ వార్డు అభ్యర్థి: అంకిరెడ్డి ప్రదీప్ రెడ్డి, 50 వార్డు అభ్యర్థి సాయి లలిత 19 వ వార్డు అభ్యర్థి సుబ్బరాయుడు వీరందరితో పాటు చైర్మన్ అభ్యర్థి అమీర్ బాషాను 'ఫ్యాన్' గుర్తుపై భారీ ఓట్లతో గెలిపించాలని ఎమ్మెల్సీ ఇసాక్ బాషాతో కలిసి ఆయన నంద్యాల వీధుల్లో జోరుగా ప్రచారం నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ అంటేనే అభివృద్ధి, సంక్షేమానికి మారుపేరు అని స్పష్టం చేశారు.
అధికారంలో ఉన్న కూటమి నేతలు, మంత్రుల తీరుపై శిల్పా రవిరెడ్డి తీవ్రస్థాయిలో మండిపడ్డారు. కోట్లాది రూపాయల విలువైన ప్రభుత్వ వ్యవసాయ మార్కెట్ యార్డు స్థలాన్ని కబ్జా చేసి టీడీపీ కార్యాలయానికి కేటాయించడంపై నిప్పులు చెరిగారు. ప్రజా ఆస్తులను పార్టీ కార్యాలయాలకు దోచిపెడుతున్న ఈ దౌర్జన్యాలను ప్రజలు గమనిస్తున్నారని, రాబోయే ఎన్నికల్లో కూటమి అభ్యర్థులకు గుణపాఠం చెప్పే సమయం ఆసన్నమైందని హెచ్చరించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు మరియు అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని కదంతొక్కారు.

# ప్రతి ఇంటికీ ఆత్మీయ పలకరింపు.. ప్రతి ఓటరుతో మమేకం.

**-25వ వార్డులో వైసీపీ అభ్యర్థి లఘుమారపు శ్వేత విస్తృత ప్రచారం.**



**నంద్యాల డ్రీమ్ టైమ్స్ జిల్లా స్టాపర్.**
నంద్యాల పట్టణంలోని స్థానిక 25వ వార్డులో వైసీపీ అభ్యర్థి లఘుమారపు శ్వేత, తన భర్త లఘు మారపు హరిప్రసాద్ తో కలిసి ఇంటింటి ప్రచారాన్ని విస్తృతంగా కొనసాగిస్తున్నారు.వార్డులోని వీధులు,నివాస ప్రాంతాలు,వ్యాపార సముదాయాల్లో పర్యటిస్తూ స్థానిక ప్రజలను ఆత్మీయంగా పలకరిస్తున్నారు.పెద్దలు,మహిళలు,యువత,వ్యాపారులను మర్యాదపూర్వకంగా కలుసుకుంటూ వారి అభిప్రాయాలు,స్థానిక సమస్యలను తెలుసుకుంటూ ప్రచారంలో ముందుకు సాగుతున్నారు.

**ఇంటింటికీ వెళ్లి ప్రజలతో మమేకం.**
ఎన్నికల ప్రచారంలో భాగంగా లఘుమారపు శ్వేత వార్డులోని ప్రతి ప్రాంతాన్ని సందర్శిస్తూ ప్రజలతో నేరుగా మాట్లాడుతున్నారు.స్థానికంగా ఎదురవుతున్న సమస్యలను అడిగి తెలుసుకుంటూ,ప్రజల అవసరాలకు ప్రాధాన్యత ఇస్తామని వివరిస్తున్నారు.ఈ సందర్భంగా వైసీపీ ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి,వేయించి తనను గెలిపించాలని ఆమె ప్రజలను కోరుతున్నారు.ప్రచార కార్యక్రమంలో లఘుమారపు హరిప్రసాద్ కూడా పాల్గొంటూ ప్రజలను కలుసుకుంటున్నారు.

**ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం.**
ఈ సందర్భంగా రఘు మారపు శ్వేత,లఘుమారపు హరిప్రసాద్ మీడియాతో మాట్లాడుతూ.."ప్రజల మధ్యే మా ప్రయాణం..ప్రజల సమస్యల పరిష్కారమే మా లక్ష్యం" అనే నినాదంతో ముందుకు సాగుతున్నామని తెలిపారు.ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యలను తెలుసుకోవడం,వార్డు అభివృద్ధికి కృషి చేయడం తమ ప్రాధాన్యమని పేర్కొన్నారు.మాజీ మంత్రి శిల్ప మోహన్ రెడ్డి,మాజీ ఎమ్మెల్యే శిల్పా రవిచంద్ర కిషోర్ రెడ్డి మరియు పిపి నాగిరెడ్డి ఆశీస్సులతో పోటీ చేస్తున్నాం..వార్డు ప్రజలందరూ మమ్మల్ని ఆశీర్వదించి,మాకు ఓటు వేసి,గెలిపించాలని విజ్ఞప్తి చేస్తున్నాం..గెలిచిన తర్వాత వార్డులో ఉన్న సమస్యలన్నీ పరిష్కరించి,వార్డును అభివృద్ధి చేస్తామని తెలిపారు.

**మౌలిక సదుపాయాలపై దృష్టి సారిస్తా.**
25వ వార్డు ప్రజలు తనకు మద్దతుగా నిలిచి,ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి,గెలిపిస్తే వార్డులోని మౌలిక సదుపాయాల మెరుగుదలకు ప్రాధాన్యత ఇస్తానని లఘుమారపు శ్వేత తెలిపారు.పారిశుధ్యం,తాగునీటి సరఫరా,పింఛన్లకు సంబంధించిన సమస్యలు,విద్యుత్ ఇబ్బందుల పరిష్కారంపై దృష్టి సారిస్తానని పేర్కొన్నారు.ప్రజల అవసరాలను గుర్తించి,వారి అభిప్రాయాలకు అనుగుణంగా వార్డు అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు.
ఇంటింటి ప్రచారం ద్వారా ప్రజలను నేరుగా కలుసుకుంటూ,వారి సమస్యలను తెలుసుకుంటూ సాగుతున్న ఈ ప్రచార కార్యక్రమంలో స్థానికులతో అభ్యర్థి మమేకమవుతున్నారు. వార్డులోని ప్రజల అవసరాలు,అభివృద్ధి అంశాలే ప్రధానంగా ప్రచారంలో ప్రస్తావిస్తూ తనకు మద్దతు ఇవ్వాలని కోరుతున్నారు.

# పుర పాలక ఎన్నికల లో కూటమి అభ్యర్థులను గెలిపించండి డాక్టర్ రవి కృష్ణ.

**-నంద్యాల పట్టణ అభివృద్ధి కోసం కృషి చేస్తాను: డాక్టర్ బాబన్.**

**-నంద్యాల పుర పాలక చైర్మన్ గా తెలుగు దేశం అభ్యర్థి డాక్టర్ బాబన్ ఘన విజయం తధ్యం: డాక్టర్ రవి కృష్ణ.**



**నంద్యాల డ్రీమ్ టైమ్స్ జిల్లా స్టాపర్.**
నంద్యాల పురపాలక చైర్మన్ పదవికి కూటమి తరపున పోటీ చేస్తున్న తెలుగుదేశం పార్టీ అభ్యర్థి డాక్టర్ బాబన్ నంద్యాల జిల్లా దివ్యాంగుల సంక్షేమ సంఘం,కళారాధన,
వివిధ స్వచ్ఛంద సంస్థల కేంద్ర కార్యాలయానికి ప్రచారం లో భాగంగా రావడం జరిగింది. డాక్టర్ బాబన్ మాట్లాడుతూ నంద్యాల పట్టణ అభివృద్ధి కోసం పెద్దలు,మేధావుల సలహాలతో కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా తెలుగు దేశం పార్టీ సీనియర్ నాయకులు, రాష్ట్ర ఐఎంఏ మాజీ అధ్యక్షులు, అంతర్జాతీయ లయన్స్ సంస్థ వైస్ డిస్ట్రిక్ట్ గవర్నర్,నంద్యాల జిల్లా దివ్యాంగుల సంక్షేమ సంఘం,నంద్యాల జిల్లా చిన్న,వీధి వ్యాపారస్తుల సంక్షేమ సంఘం గౌరవ అధ్యక్షులు,కళారాధన వ్యవస్థాపక ప్రధాన కార్యదర్శి, వివిధ క్రీడా సంఘాల అధ్యక్షులు డాక్టర్ రవి కృష్ణ ఈ సందర్భంగా డాక్టర్ బాబన్ ను సత్కరించారు. డాక్టర్ రవి కృష్ణ మాట్లాడుతూ డాక్టర్ బాబన్ తో పాటు కూటమి అభ్యర్థుల విజయానికి కృషి చేస్తామని ప్రకటించారు.కూటమి ప్రభుత్వం ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు,ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్,తెలుగుదేశం పార్టీ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ నారా లోకేష్, మంత్రి ఫరూక్ ల నేతృత్వంలో అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు,అభివృద్ధి పనులు కూటమి అభ్యర్థుల విజయానికి దోహదం చేస్తాయని అన్నారు. ఈ కార్యక్రమంలో నంద్యాల జిల్లా దివ్యాంగుల సంక్షేమ సంఘం అధ్యక్షులు ఎం.పి.వి.రమణయ్య, కళారాధన కార్యనిర్వాహక కార్యదర్శి,సినీ,టీవీ, నాటక రంగ నటులు ఎస్.ఆర్.ఎస్.ప్రసాద్, లయన్స్ క్లబ్ జోనల్ చైర్మన్ సోమేశుల నాగరాజు,కళారాధన కార్యవర్గ సభ్యులు శివరామిరెడ్డి,పద్మశాలి సంఘం రాష్ట్ర నాయకులు రామయ్య , దివ్యాంగుల సంక్షేమ సంఘం ఉపాధ్యక్షులు వెంకటరావు,రంగస్వామి,తెలుగు దేశం పార్టీ నాయకులు రామస్వామి తదితరులు పాల్గొన్నారు.

# కొత్త పింఛన్లకు తప్పని నిరీక్షణ

**- ఎన్నికల కోడ్ తో మరింత ఆలస్యం**

**గుంతకల్లు, అక్టోబరు 24(డ్రీమ్ టైమ్స్):**
రెండున్నర ఏళ్ల తర్వాత కొత్తగా పింఛన్లు మంజూరు చేసేందుకు కూటమి ప్రభుత్వం నోటిఫికేషన్ విడుదల చేయడంతో జిల్లా వ్యాప్తంగా గత నెలలో స్వర్ణ వార్డు, గ్రామ కార్యాలయాల్లో వృద్ధాప్య, వితంతు, దివ్యాంగ, మెడికల్ తదితర పది రకాల పింఛన్ల మంజూరు కోరుతూ వేలాది మంది దరఖాస్తు చేశారు. జిల్లా స్థాయిలో ఆమోదం తెలిపిన ఈ దరఖాస్తులను రాష్ట్రస్థాయి అధికారులు ఆమోదానికి పంపారు. ఈలోగా స్థానిక సంస్థలు ఎన్నికల కోడ్ అమలులోకి రావడంతో మంజూరు ప్రక్రియ ఆగిపోయింది. ఈ క్రమంలో సంక్షేమ పథకాల్లో మార్పులు, చేర్పులకు అవకాశం ఉండదు. పింఛన్ల కోసం లబ్ధిదారులు ఎన్నికలు అయ్యే వరకు వేచి ఉండాల్సిన పరిస్థితి నెలకొంది. స్థానిక సంస్థల ఎన్నికలు డిసెంబర్ మొదటి వారంలో పూర్తవుతాయి. ప్రస్తుతం జిల్లా, మండల స్థాయి అధికారులు అందరూ స్థానిక సంస్థల ఎన్నికల విధుల్లో ఉన్నారు. కోడ్ ముగిసిన తరువాత కొత్త ఏడాది పింఛన్లు మంజూరయ్యే అవకాశం ఉంది. అప్పటివరకు లబ్ధిదారులు వేచి ఉండాల్సిందే.

# పోలీసుల ఆయుధాలు, సాంకేతిక పరిజ్ఞానంపై విద్యార్థులకు అవగాహన





**-నంద్యాల జిల్లా పోలీసు కార్యాలయంలో ఓపెన్ హౌస్ ఎగ్జిబిషన్.. పోలీసు జాగిలాల ప్రదర్శన ప్రత్యేక ఆకర్షణ**

**నంద్యాల క్రైమ్ । డ్రీమ్ టైమ్స్ అక్టోబర్ 24, 2026**
నంద్యాల :పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా నంద్యాల జిల్లా పోలీసు కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఓపెన్ హౌస్ ఎగ్జిబిషన్ విద్యార్థులకు పోలీసు విధులు, ఆయుధాలు, సాంకేతిక పరిజ్ఞానంపై అవగాహన కల్పించింది. జిల్లా ఎస్పీ శ్రీ సునీల్ షొరాణ్, ఐపీఎస్ ఆదేశాల మేరకు ఏఆర్ అదనపు ఎస్పీ చిన్నికృష్ణ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీసు విధి నిర్వహణలో వినియోగించే ఆయుధాలు, రక్షణ పరికరాలు, కమ్యూనికేషన్ సాధనాలు, మెటల్ డిటెక్టర్లు తదితర పరికరాలను ప్రదర్శనలో ఉంచారు. వాటి పనితీరు, వినియోగం గురించి పోలీసు అధికారులు విద్యార్థినీ విద్యార్థులకు వివరించారు.

**పోలీసుల త్యాగాలు, విధులపై అవగాహన**
ప్రజల రక్షణ, శాంతిభద్రతల పరిరక్షణలో పోలీసుల పాత్ర ఎంతో కీలకమని ఏఆర్ అదనపు ఎస్పీ చిన్నికృష్ణ పేర్కొన్నారు. విధి నిర్వహణలో ప్రాణాలు అర్పించిన పోలీసు అమరవీరుల త్యాగాలను స్మరించుకుంటూ ప్రతి సంవత్సరం అక్టోబర్ 21 నుంచి 31 వరకు సంస్మరణ వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకుని ఉన్నత స్థాయికి ఎదగాలని సూచించారు. శాంతిభద్రతల పరిరక్షణలో ప్రజలందరూ పోలీసు శాఖకు సహకరించాలని కోరారు.

**ఆయుధాలు, రక్షణ పరికరాల ప్రదర్శన**
ఎగ్జిబిషన్‌లో ఏకే-47 రైఫిల్, ఎస్ఎల్ఆర్, బోల్ట్ యాక్షన్ రైఫిల్, 9 ఎంఎం పిస్టల్, రివాల్వర్, టియర్ స్మోక్ పరికరాలు, గ్యాస్ గన్, ఫైబర్ లాఠీలు, హెల్మెట్లు, స్టోన్ గార్డులు, బాడీ ప్రొటెక్టర్లు, వైర్‌లెస్ కమ్యూనికేషన్ పరికరాలు, హ్యాండ్‌హెల్డ్ మెటల్ డిటెక్టర్లు, డోర్ ఫ్రేమ్ మెటల్ డిటెక్టర్లు తదితర పరికరాలను ప్రదర్శించారు. వాటి వినియోగం, విధి నిర్వహణలో వాటి ప్రాధాన్యతను అధికారులు వివరించారు.

**సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి**
ఫింగర్ ప్రింట్, సైబర్ క్రైమ్, ఈగల్ టీమ్‌ల సిబ్బంది విద్యార్థులకు ప్రస్తుత సమాజంలో చోటుచేసుకుంటున్న నేరాలు, సైబర్ మోసాలపై అవగాహన కల్పించారు. అపరిచితుల మోసపూరిత మాటలకు ఆకర్షితులు కావద్దని, సైబర్ నేరగాళ్ల వలలో పడకుండా జాగ్రత్తగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తెలుసుకున్న విషయాలను తమ తల్లిదండ్రులకు కూడా తెలియజేయాలని, నేరాలకు పాల్పడే వ్యక్తులకు దూరంగా ఉండాలని కోరారు.

**పోలీసు జాగిలాల ప్రదర్శన ప్రత్యేక ఆకర్షణ**
పోలీసు జాగిలాలు హనీ, డయానా ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. మత్తుపదార్థాలు, పేలుడు పదార్థాలను గుర్తించడంలో, హత్యలు, దొంగతనాల వంటి ఘటనల్లో నిందితులను గుర్తించే ప్రక్రియలో పోలీసు జాగిలాలు ఎలా సహాయపడతాయో సిబ్బంది వివరించారు. పోలీసు శాఖ విధులు, ప్రజా భద్రత, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంపై విద్యార్థులకు అవగాహన కల్పించడంలో ఈ ఓపెన్ హౌస్ ఎగ్జిబిషన్ ఉపయోగకరంగా నిలిచింది.

# సిపిఐ అభ్యర్థులకు రక్షణ కల్పించాలి.

**-జిల్లా కార్యదర్శి రంగనాయుడు.**

**నంద్యాల డ్రీమ్ టైమ్స్ జిల్లా స్టాపర్..**
సంస్థల ఎన్నికల్లో పోటీ చేస్తున్న సిపిఐ అభ్యర్థులకు తగిన రక్షణ కల్పించాలని కోరుతూ సిపిఐ నంద్యాల జిల్లా నాయకుల బృందం జిల్లా ఎస్పీ కార్యాలయంలో ఎస్‌బీ డీఎస్పీ శ్రీనివాస రెడ్డిని కలసి వినతిపత్రం సమర్పించారు. ఈ బృందంలో సిపిఐ జిల్లా కార్యదర్శి ఎన్. రంగనాయుడు, ఏఐటీయూసీ రాష్ట్ర నాయకులు రమేష్ బాబు, పట్టణ కార్యదర్శి ప్రసాద్, జిల్లా కార్యవర్గ సభ్యుడు నాగరాముడు, రైతు సంఘం జిల్లా కార్యదర్శి సోమన్న పాల్గొన్నారు. అనంతరం పట్టణంలోని సిపిఐ జిల్లా కేంద్రంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో సిపిఐ జిల్లా కార్యదర్శి ఎన్. రంగనాయుడు మాట్లాడుతూ, జిల్లాలో అధికార టిడిపి, ప్రతిపక్ష వైస్సార్సీపీ కుమ్మక్కై ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్నాయని తీవ్రంగా ధ్వజమెత్తారు. అధికార టిడిపికి 60 శాతం, వైస్సార్సీపీ 40 శాతం జడ్పిటిసి, ఎంపీటీసీ, సర్పంచ్ స్థానాలు కేటాయించుకుని ఇతరులు ఎవరూ స్థానిక సంస్థలలో నామినేషన్లు వేయకుండా అడ్డుకోవడం దారుణమన్నారు.
?భారత కమ్యూనిస్టు పార్టీ తరఫున డోన్‌లో ఏడు ఎంపీటీసీ స్థానాలకు నామినేషన్లు వేయడానికి వెళితే, అధికార పార్టీకి పోలీసులు పుష్కలంగా అండదండలు అందిస్తూ నామినేషన్లను అడ్డుకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. నంద్యాల జిల్లాలో సిపిఐ తరఫున డోన్ మున్సిపాలిటీ, నంద్యాల మున్సిపాలిటీలతో పాటు జడ్పిటిసి, ఎంపీటీసీ స్థానాలకు పోటీ చేస్తున్న అభ్యర్థులకు పోలీసు వారి రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు. అనేక చోట్ల నామినేషన్ పత్రాలు



సమర్పించడానికి వెళ్తున్న అభ్యర్థుల పత్రాలను రౌడీ మూకలతో చించి వేయించడం దారుణమన్నారు. పేదల పక్షాన, ప్రజా సమస్యల పరిష్కారం కోసం ఎల్లప్పుడూ పోరాడే సిపిఐ పార్టీకి చట్టసభల్లో ప్రాతినిధ్యం కల్పించాల్సిన బాధ్యత ప్రజలపై ఉందన్నారు.
?ఈ సందర్భంగా జిల్లాలో జడ్పిటిసి అభ్యర్థులుగా పోటీ చేస్తున్న బనగానపల్లె - ఆవుల సుబ్బారెడ్డి, రుద్రవరం - కే. భాస్కర్, వెంకట రాజన్న, కొలిమిగుండ్ల - కడియాల ఉదయభాను, నంద్యాల - రమాదేవి, డోన్ - ఎం. రాజేశ్వరి, జూపాడుబంగ్లా - ఎం. పరిమళ, మహానంది - షేక్ మైమున్నిసా పేర్లను వెల్లడించారు. అలాగే ఎంపీటీసీ అభ్యర్థులుగా ఓబులాపురం - కురువ పద్మావతి, ఉంగరానిగుండ్ల - జి. కమలమ్మ, ఎద్దుపెంట - బంగారు శకుంతలమ్మ, వడ్డే రామేశ్వరమ్మ, చనుగొండ్ల - ఎస్. దస్తగిరి, చంద్రకళ సువర్ణ, దొరపల్లి - కున్నరు కొండయ్య, కామగానిగుండ్ల - హరిజన రామాంజనేయులు, కమలాపురం - తెలకి లలిత, తిమ్మాపురం-2 - చల్లా మాధవి, కడిపాడు - మద్దూరు పుష్పలత, పెద్దకంబులూరు - మంగలి పాములేటి, ఎం. రామచంద్రుడు నామినేషన్లు వేసినట్లు తెలిపారు.

అలాగే మున్సిపాలిటీ స్థానాలకు సంబంధించి నంద్యాల పట్టణంలో 3వ వార్డులో బాబా ఫక్రుద్దీన్, 26వ వార్డులో పాలె సుశీలమ్మ, 52వ వార్డులో ఎస్. ఈశ్వరమ్మలు పోటీ చేస్తున్నారని వెల్లడించారు. డోన్ మున్సిపాలిటీ పరిధిలో 22వ వార్డులో పి. సుంకయ్య, 21వ వార్డులో జి. రనత్ యాదవ్) సిపిఐ అభ్యర్థులుగా బరిలో ఉన్నారని తెలిపారు. ఇదే సందర్భంలో జిల్లాలోని ప్రధాన ప్రజా సమస్యలపై సిపిఐ నాయకులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. జిల్లాలో రైతులకు సకాలంలో సాగునీరు అందక పంటలు ఎండిపోతున్నాయని, అలాగే నంద్యాల పట్టణంతో పాటు పలు మండలాల్లో సరైన డ్రైనేజీ వ్యవస్థ లేక మురుగునీరు రోడ్లపై నిలిచి ప్రజలు రోగాల బారిన పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లాలోని ప్రధాన రహదారులు, గ్రామీణ రోడ్లు గోతులమయంగా మారి నిత్యం ప్రమాదాలు జరుగుతున్నా అధికారులు పట్టించుకోకపోవడం శోచనీయమన్నారు. వెంటనే రహదారులకు మరమ్మతులు చేపట్టాలని, అర్హులైన నిరుపేదలకు ఇళ్ల స్థలాలు మంజూరు చేసి, ఆకాశాన్నంటుతున్న నిత్యవసర ధరలను అదుపులోకి తీసుకురావాలని సిపిఐ నాయకులు డిమాండ్ చేశారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం ఎల్లప్పుడూ అండగా నిలిచే సిపిఐ అభ్యర్థులను స్థానిక ఎన్నికల్లో అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ప్రజలకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బనగానపల్లె మండల కార్యదర్శి శివయ్య, నంద్యాల పట్టణ సిపిఐ సహాయ కార్యదర్శి లక్ష్మీదేవి, రైతు సంఘం జిల్లా అధ్యక్షులు సుబ్బారెడ్డి ఏఐటీయూసీ పట్టణ అధ్యక్ష కార్యదర్శులు డి శ్రీనివాసులు ఏ ధనుంజయ్ తదితరులు పాల్గొన్నారు.

# నంద్యాల గడ్డపై రగిలిన శిల్పా రవిరెడ్డి.

**-పురపాలికలో వైఎస్సార్‌సీపీ జెండా ఎగరడం తథ్యం.**
**-"దగాకోరు కూటమి మోసాలను నమ్మి మరోసారి మోసపోకండి.**
**-నంద్యాల అభివృద్ధి మనందరి బాధ్యత." మాజీ ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిషోర్ రెడ్డి..**

**నంద్యాల డ్రీమ్ టైమ్స్ జిల్లా స్టాపర్.**
మున్సిపల్ ఎన్నికల రణభేరి హోరాహోరీగా శిల్పా రవిరెడ్డి ప్రచారం
రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికల వేడి తారాస్థాయికి చేరిన వేళ నంద్యాల పురపాలక సంఘం చరిత్రలో సరికొత్త అధ్యాయాన్ని లిఖించేందుకు మాజీ ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిషోర్ రెడ్డి రణభేరి మోగించారు. పట్టణంలోని పలు వార్డుల్లో హోరాహోరీగా ఎన్నికల ప్రచారం నిర్వహించిన ఆయన, కూటమి ప్రభుత్వ మోసాలపై నిప్పులు చెరిగారు. నంద్యాల గడ్డపై మరోసారి వైఎస్సార్‌సీపీ జెండాను అత్యుత్సాహంతో రెపరెపలాడిస్తామని ఉద్వేగంగా ప్రకటించారు.
పోరుబాటలో వైఎస్సార్‌సీపీ అభ్యర్థులు...పట్టణంలోని 32,34,38,39 వార్డుల్లో శిల్పా రవిరెడ్డి విస్తృతంగా పర్యటించి వైఎస్సార్‌సీపీ అభ్యర్థుల విజయానికి ఓటర్లను అభ్యర్థించారు. 32వ వార్డు అభ్యర్థి:వై రోజమ్మ, 34వ వార్డు అభ్యర్థి పోలూరు లక్ష్మీదేవి, 38



వ వార్డు అభ్యర్థి మేష చంద్రశేఖర్ ,39వ వార్డు అభ్యర్థి: ముత్యాల విజయలక్ష్మి మరియు చైర్మన్ అభ్యర్థి: అమీర్ బాష (దాల్మిల్ అమీర్) ఈ అభ్యర్థులందరినీ అత్యధిక మెజారిటీతో గెలిపించి, నంద్యాల పురపాలికలో వైఎస్సార్‌సీపీ పతాకాన్ని సగర్వంగా ఎగరేయాలని ఆయన పిలుపునిచ్చారు.
కూటమి ప్రభుత్వంపై ఉగ్రరూపం దాల్చిన శిల్పా రవిరెడ్డి...ఈ సందర్భంగా ప్రజలను ఉద్దేశించి ప్రసంగించిన శిల్పా రవిరెడ్డి, కూటమి నేతల తీరుపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. "గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో జగన్ మోహన్ రెడ్డి నాయకత్వంలో నేరుగా ప్రజల వద్దకు 'గడపగడపకు' వెళ్లాం. ప్రజల కష్టాలను, సమస్యలను స్వయంగా తెలుసుకొని పరిష్కరించాం. కానీ నేడు 'ఇంటింటికి తెలుగుదేశం' అంటున్న ఈ పాలకుల నాయకులు ఎప్పుడైనా మీ ఇంటి ముంగిటికి వచ్చారా?" అంటూ సూటిగా ప్రశ్నించారు. ఎన్నికల సమయంలో అమలు సాధ్యంకాని వాగ్దానాలు ఇచ్చి, 'సూపర్ సిక్స్' అంటూ ఆకాశానికి నిచ్చెనలు వేసి... అధికారంలోకి వచ్చాక ప్రజలను నట్టేట ముంచారని, నమ్మించి గొంతు కోశారని తీవ్రంగా మండిపడ్డారు.
సేవా కార్యక్రమాల అడ్డుకోవడంపై భావోద్వేగంతో...శిల్పా సేవా సమితి ఆధ్వర్యంలో నిరుపేదలకు, ప్రజలకు అందుతున్న సేవలను అడ్డుకోవడానికి కొందరు కుట్రలు పన్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజలకు అండగా నిలవకుండా తమ సేవలను అడ్డుకున్న వైనాన్ని ప్రజలకు కళ్లకు కట్టినట్లు వివరిస్తూ భావోద్వేగానికి గురయ్యారు. ఎన్ని అడ్డంకులు సృష్టించినా ప్రజల గుండెల్లో నిలిచిన తనను, ఎవరూ ఆపలేరని స్పష్టం చేశారు.నంద్యాల సమగ్రాభివృద్ధి కేవలం వైఎస్సార్‌సీపీతోనే సాధ్యమని, ప్రజలందరూ అప్రమత్తమై మోసపూరిత కూటమి మాటలను నమ్మవద్దని కోరారు. అభివృద్ధికి పట్టం కట్టేలా, పేదల సంక్షేమాన్ని కాపాడేలా ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి వైఎస్సార్‌సీపీ అభ్యర్థులను అఖండ మెజారిటీతో గెలిపించాలని ఆయన కోరారు నంద్యాల గడ్డపై వైఎస్సార్‌సీపీ జెండా ఎగరడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు.

# నంద్యాలలో బ్యాంకు కోచింగ్ విద్యార్థి అనుమానాస్పద మృతి

**-లలిత నగర్ హాస్టల్‌లో కుళ్లిన స్థితిలో మృతదేహం గుర్తింపు..**
**-పోస్టుమార్టం కోసం ప్రభుత్వ ఆసుపత్రికి తరలింపు**



**నంద్యాల క్రైమ్ । డ్రీమ్ టైమ్స్ అక్టోబర్ 24, 2026**
నంద్యాల :నంద్యాలలోని లలిత నగర్‌లో బ్యాంకు ఉద్యోగాల కోసం శిక్షణ పొందుతున్న ఓ విద్యార్థి అనుమానాస్పద స్థితిలో మృతి చెందడం స్థానికంగా కలకలం రేపింది. హాస్టల్ గదిలో నుంచి దుర్వాసన రావడంతో ఈ ఘటన వెలుగులోకి వచ్చింది. మృతుడిని నెల్లూరు జిల్లా కొవ్వూరుకు చెందిన సువర్ధన్ (26)గా గుర్తించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సువర్ధన్ మూడు నెలల క్రితం నంద్యాలలోని ఓ బ్యాంకు కోచింగ్ సెంటర్‌లో శిక్షణ కోసం చేరాడు. సమీపంలోని హాస్టల్‌లో ఉంటూ కోచింగ్ తీసుకుంటున్నాడు. గురువారం రాత్రి 9.30 గంటల సమయంలో తల్లితో ఫోన్‌లో మాట్లాడినట్లు పోలీసులు ప్రాథమికంగా గుర్తించారు. గత రెండు రోజులుగా సువర్ధన్ గది నుంచి బయటకు రాకపోవడం, గదిలో నుంచి తీవ్ర దుర్వాసన రావడంతో స్థానికులకు అనుమానం కలిగింది. హాస్టల్ యజమాని సహాయంతో గది తలుపులు తెరిచి చూడగా, సువర్ధన్ మృతదేహం ఉబ్బిన స్థితిలో కనిపించింది. దీంతో వెంటనే కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న కుటుంబ సభ్యులు నంద్యాలకు చేరుకున్నారు. మృతదేహాన్ని స్వగ్రామానికి తీసుకెళ్లేందుకు ప్రయత్నించగా, ఘటనా స్థలానికి చేరుకున్న టూ టౌన్ పోలీసులు వారిని నిలువరించి, చట్టపరమైన ప్రక్రియలో భాగంగా పోస్టుమార్టం నిర్వహించడం అవసరమని వివరించారు. అనంతరం మృతదేహాన్ని నంద్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుడి తండ్రి ప్రభాకర్ రావు సోమశిలలోని స్టేట్ బ్యాంక్‌లో మేనేజర్‌గా విధులు నిర్వహిస్తున్నట్లు తెలిసింది. విద్యార్థి మృతికి గల కారణాలు ఇంకా తెలియాల్సి ఉంది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. పోస్టుమార్టం నివేదిక వచ్చిన తర్వాత మృతికి సంబంధించిన మరిన్ని వివరాలు వెల్లడయ్యే అవకాశం ఉంది.

# శ్రీశైలంలో 'శివవైభవం' ప్రవచనం.. భక్తి సంగీత కార్యక్రమం



**తేదీ: 24.10.2026 । డ్రీమ్ టైమ్స్ తెలుగు**
శ్రీశైలం: శ్రీశైల దేవస్థానం ఆధ్వర్యంలో ధర్మపథంలో భాగంగా నిర్వహిస్తున్న నిత్య కళారాధన కార్యక్రమంలో శనివారం 'శివవైభవం' అంశంపై ప్రవచన కార్యక్రమం, భక్తి సంగీత కార్యక్రమం నిర్వహించారు. ఆలయ దక్షిణ మాడవీధిలోని నిత్య కళారాధన వేదికపై సికింద్రాబాద్‌కు చెందిన అష్టావధాని శ్రీ సురభి శంకరశర్మ 'శివవైభవం'పై ప్రవచనం చేశారు. ఈ సందర్భంగా శివతత్వం, ఆధ్యాత్మిక విశేషాలపై ప్రవచన కార్యక్రమం సాగింది. అనంతరం హైదరాబాద్‌కు చెందిన శ్రీ వై.సి.హెచ్.ఎం.బి. స్వామి మరియు వారి బృందం భక్తి సంగీత కార్యక్రమాన్ని నిర్వహించారు. భక్తి గీతాలతో కార్యక్రమం ఆధ్యాత్మిక వాతావరణాన్ని సంతరించుకుంది. శ్రీశైల దేవస్థానం నిత్య కళారాధనలో భాగంగా ఆయా రోజుల్లో హరికథ, బుర్రకథ, సంప్రదాయ నృత్యం, వాయిద్య సంగీతం, భక్తిరంజని తదితర సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహిస్తోంది. శ్రీస్వామి అమ్మవార్లకు ఆయా కైంకర్యాలు పరిపూర్ణంగా జరగాలని, ప్రాచీన సంప్రదాయ కళలను పరిరక్షించి ప్రోత్సహించాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు దేవస్థానం పేర్కొంది.

# తనకల్లు వద్ద విషాద రోడ్డు ప్రమాదం

**-ప్రభుత్వ ఉపాధ్యాయుడు మృతి, మరొకరికి గాయాలు**
**-రెడ్డెంవారిపల్లి క్రాస్ వద్ద ద్విచక్రవాహనాలు ఢీకొని ఉపాధ్యాయుడి దుర్మరణం**
**-రెడ్డెంవారిపల్లి క్రాస్ వద్ద రోడ్డు ప్రమాదం -- ఉపాధ్యాయుడు మృతి, మరొకరికి గాయాలు**





**తనకల్లు అక్టోబర్ 24 డ్రీమ్ టైమ్స్ న్యూస్**
తనకల్లు పోలీస్ స్టేషన్ పరిధిలోని రెడ్డెంవారిపల్లి క్రాస్ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో బొంతలపల్లి ఉన్నత పాఠశాలలో భౌతిక శాస్త్ర ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న నాగభూషణం మృతి చెందగా, అదే పాఠశాలకు చెందిన తెలుగు ఉపాధ్యాయుడు జాఫర్ హుస్సేన్ గాయపడ్డారు. పాఠశాల విధులు ముగించుకొని సాయంత్రం సమయంలో నాగభూషణం తన ద్విచక్రవాహనంపై జాఫర్ హుస్సేన్‌ను వెనుక కూర్చోబెట్టుకొని వెళ్తుండగా, రెడ్డెంవారిపల్లి క్రాస్ వద్ద ఎదురుగా వచ్చిన మరో ద్విచక్రవాహనం ఢీకొట్టింది. ఆ వాహనాన్ని అమడుగూరు మండలం మహమ్మదాబాద్‌లో పోస్ట్‌మాస్టర్‌గా పనిచేస్తున్న సలీం భాష నడుపుతున్నట్లు తెలిసింది. ఈ ప్రమాదంలో నాగభూషణం తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందగా, వెనుక ఉన్న జాఫర్ హుస్సేన్‌కు గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న తనకల్లు పోలీసులు, వందేమాతరం టీమ్ సభ్యులు అశోక్, మహబూబ్ బృందం వెంటనే సంఘటనా స్థలానికి చేరుకొని సహాయక చర్యలు చేపట్టారు. గాయపడిన ఉపాధ్యాయుడిని తనకల్లు ఆస్పత్రికి తరలించగా, మృతదేహాన్ని వందేమాతరం టీమ్ అంబులెన్స్‌లో కదిరి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనపై తనకల్లు పోలీసులు కేసు నమోదు చేసి తదుపరి చట్టపరమైన చర్యలు చేపట్టారు.

# మున్సిపల్ చైర్మన్ అభ్యర్థి ప్రచారం ఖర్చు రూ.20 లక్షలు

**గుంతకల్లు, అక్టోబరు 24(డ్రీమ్ టైమ్స్):**
ఎన్నికల ప్రవర్తన నియమావళికి విరుద్ధంగా వ్యవహరిస్తే ఉపేక్షించొద్దు. స్థానిక ఎన్నికల్లో అభ్యర్థుల వ్యయపరిమితులను రాష్ట్ర ఎన్నికల సంఘం నిర్దేశించింది. మున్సిపల్ చైర్మన్ అభ్యర్థి రూ.20 లక్షలు, మున్సిపల్ వార్డు సభ్యులు రూ.7.50 లక్షలకు మించి ఖర్చు చేయకూడదు. వ్యయ కమిటీలు, స్టాటిక్ సర్వేలియన్స్ బృందాలు, వీడియో వ్యూయింగ్ బృందాలు, ఎం సి సి బృందాలు 24 గంటలూ తనిఖీలు చేయాలి. నోడల్ అధికారులు ఎప్పటికప్పుడు నివేదికలు ఇవ్వాలి.

# ఎన్టీఆర్ సర్కిల్లో త్రుటిలో తప్పిన ప్రమాదం

**- విద్యుత్ స్తంభాన్ని ఢీకొన్న ట్రాన్స్పోర్ట్ వాహనం**
**- కొంతమేర విద్యుత్ సరఫరాకు అంతరాయం**



గుంతకల్లు, అక్టోబరు 24 (డ్రీమ్ టైమ్స్): పత్తికొండ వైపు వెళుతున్న ఓ ట్రాన్స్పోర్ట్ వాహనం గుంతకల్లు పట్టణంలోని ఎన్టీఆర్ సర్కిల్లో శనివారం రాత్రి 8 గంటల సమయంలో మలుపు తిరుగుతున్న సమయంలో డివైడర్ పై ఉన్న విద్యుత్ స్తంభాన్ని ఢీకొనడంతో అది కాస్త ఒరిగింది. అయితే త్రుటిలో ప్రమాదం తప్పినట్లు అయింది. దీంతో ఎన్టీఆర్ సర్కిల్ నుండి కన్యకా పరమేశ్వరి ఆలయం వరకు మెయిన్ రోడ్ లో విద్యుత్ సరఫరాకు కొంతసేపు అంతరాయం కలిగింది. పట్టణంలో ఎన్టీఆర్ సర్కిల్లో సాయంత్రం వేళల్లో ట్రాఫిక్ రద్దీ అధికంగా ఉంటుంది. ఈ సమయంలో భారీ వాహనాలు పట్టణంలో పట్టణంలోకి రావడం వల్ల ట్రాఫిక్ అంతరాయం కలగడమే కాకుండా ప్రమాదాలు చోటు చేసుకునే అవకాశం లేకపోలేదు. ఇటీవలే గుత్తి రోడ్డు నుండి (60 అడుగుల రోడ్డులో) ఆర్టీసీ బస్టాండ్ మీదుగా పట్టణంలోకి ఓ భారీ వాహనం ప్రవేశించే సమయంలో పొట్టి శ్రీరాములు సర్కిల్లో ఓ శిలాఫలకాన్ని ఢీకొనడంతో ఓ వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందిన సంఘటన ఇటీవల చోటు చేసుకున్న విషయం తెలిసిందే. ఇప్పటికైనా జరుగుతున్న సంఘటనలను దృష్టిలో ఉంచుకొని సంబంధిత అధికారులు భారీ వాహనాలను పట్టణంలోకి ప్రవేశించకుండా నియంత్రించాల్సిన అవసరం ఎంతైనా ఉందని పలువురు అభిప్రాయపడుతున్నారు. కాగా శనివారం రాత్రి 8 గంటల సమయంలో ఎన్టీఆర్ సర్కిల్లో డివైడర్ పై ఉన్న విద్యుత్ స్తంభాన్ని భారీ వాహనం ఢీకొని ఆ స్తంభం ఒరిగిపోయిందన్న విషయం చూసుకున్న సంబంధిత మున్సిపల్ విద్యుత్ విభాగం అధికారులు, సిబ్బంది తక్షణమే అక్కడికి చేరుకొని తగిన చర్యలకు ఉపక్రమించారు. ట్రాఫిక్ రద్దీగా ఉన్న సమయంలో జరిగిన ఈ సంఘటన వల్ల ఇలాంటి ప్రమాదం జరగకపోవడంతో ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు.

# వేమనా.. ఈ దీనస్థితి ఏందన్నా?



మొదటి తరువాయి

సంబంధించిన చీపుర్లు, పనికిరాని వస్తువులు, ఇతర సామగ్రిని పేరబెట్టడం విమర్శలకు తావిస్తోంది. విగ్రహం ముందు ఎడమ, కుడి వైపులా వస్తువులను అస్తవ్యస్తంగా ఉంచడంతో ఆ ప్రాంగణం అపరిశుభ్రంగా కనిపిస్తోంది. మహాకవి విగ్రహం ప్రజలకు కనిపించేలా, గౌరవప్రదమైన వాతావరణంలో ఉండాల్సింది పోయి, పనికిరాని వస్తువులను నిల్వచేసే ప్రదేశంగా మారడం బాధాకరమని సాహితీ అభిమానులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**వీపున రేకుల షెడ్డు.. ఇదేం దుస్థితి?**
వేమన విగ్రహం వెనుక భాగంలో రేకుల షెడ్డు నిర్మించడం మరో అంశంగా మారింది. ప్రజల అవసరాల కోసం షెడ్డు నిర్మించడం తప్పు కాకపోవచ్చు. అయితే, దాని నిర్వహణలో భాగంగా విగ్రహం చుట్టుపక్కల ప్రాంతాన్ని నిర్లక్ష్యం చేయడం ఎంతవరకు సమంజసమన్న ప్రశ్నలు వినిపిస్తున్నాయి. సమాజానికి నీతి, నైతికత, మానవత్వం బోధించిన మహాకవి విగ్రహం చుట్టూ ఇలాంటి పరిస్థితులు నెలకొనడం ఆయనకు మనం ఇస్తున్న గౌరవానికి నిదర్శనమా? అని సాహితీ ప్రియులు ప్రశ్నిస్తున్నారు.

అధికారుల కళ్లకు ఈ దుస్థితి కనిపించడం లేదా?
ప్రత్యేక అధికారుల పాలనలో ఉన్న చిట్వేలి గ్రామపంచాయతీ కార్యాలయానికి అతి సమీపంలోనే వేమన విగ్రహం ఉంది. అయినప్పటికీ, దాని చుట్టూ పేరుకుపోయిన పనికిరాని వస్తువులను తొలగించి, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచే చర్యలు కనిపించడం లేదని స్థానికులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. కార్యాలయం పక్కనే ఉన్న విగ్రహం పరిస్థితినే పట్టించుకోకపోతే, పట్టణంలోని ఇతర ప్రాంతాల నిర్వహణ ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు.

**వేమనకు నిజమైన నివాళి ఇదేనా?**
వేమన విగ్రహం చుట్టూ ఉన్న ప్రాంతాన్ని శుభ్రపరిచి, పనికిరాని వస్తువులను తొలగించి, పచ్చదనంతో ఆ ప్రాంగణాన్ని అందంగా తీర్చిదిద్దాలని సాహితీవేత్తలు, స్థానికులు కోరుతున్నారు. విగ్రహం చుట్టూ పరిశుభ్రమైన వాతావరణాన్ని కల్పించి, మహాకవి గౌరవానికి భంగం కలగకుండా చూడాల్సిన బాధ్యత గ్రామపంచాయతీ అధికారులపై ఉందని వారు గుర్తుచేస్తున్నారు. విగ్రహాలు ఏర్పాటు చేయడంతోనే బాధ్యత ముగిసిపోదని, వాటి నిర్వహణలోనూ అదే నిబద్ధత కనిపించాలని అభిప్రాయపడుతున్నారు. మహాకవి వేమన బోధనలు నేటికీ సమాజానికి మార్గదర్శకాలు. అలాంటి మహనీయుడి విగ్రహం అపరిశుభ్రత మధ్య కనిపించడం చిట్వేలి ప్రజలకు, ముఖ్యంగా సాహితీ అభిమానులకు ఆవేదన కలిగిస్తోంది. మరి అధికారులైనా స్పందించి వేమన విగ్రహానికి తగిన గౌరవాన్ని కల్పిస్తారా? లేక ఈ దీనస్థితి ఇలాగే కొనసాగుతుందా? అన్నది వేచి చూడాల్సిందే.

# గుంతకల్లులో అప్పుడే.. ప్రధాన పార్టీల ప్రచార హోరు

**- టిడిపికి రెబల్స్ బెడద**
**- బరిలో నిలిచే అభ్యర్థుల జాబితా నేడు విడుదల**





**గుంతకల్లు, అక్టోబరు 24(డ్రీమ్ టైమ్స్):**
గుంతకల్లు మున్సిపాలిటీలో ఎన్నికలకు సంబంధించి నామినేషన్ల ప్రక్రియ, పరిశీలన, ఉపసంహరణల పర్వం ముగియడంతో టిడిపి, వైసిపి పార్టీల మున్సిపల్ చైర్ పర్సన్ అభ్యర్థులు తమ తమ పార్టీలకు చెందిన వార్డు కౌన్సిలర్లతో కలిసి అప్పుడే ప్రచారం మొదలుపెట్టేశారు. ఎన్నికల షెడ్యూల్ వాయిదా పడడంతో ఈనెల 25వ తేదీ ఎన్నికల బరిలో నిలిచే అభ్యర్థుల జాబితా విడుదల కానుంది. అయితే టిడిపి తరపున మున్సిపల్ చైర్ పర్సన్ గా పోటీలో నిలిచిన దివంగత, మాజీ ఎమ్మెల్యే సాయినాథ్ గౌడ్ కోడలు, టిడిపి తాజా మాజీ మున్సిపల్ కౌన్సిలర్ రామ గౌని పవన్ కుమార్ గౌడ్ సతీమణి యశోద గౌడ్ నామినేషన్ల పరిశీలన ముగిసిన క్షణం నుంచే ప్రచారం ప్రారంభించారు. ఈమెకు తోడుగా చిన్నమామలు మాజీ ఎమ్మెల్యే జితేంద్ర గౌడ్, శ్రీనాథ్ గౌడ్, భర్త పవన్ కుమార్ గౌడ్ లు కూటమి పార్టీల నాయకులు, కార్యకర్తలను వెంటబెట్టుకొని.. టిడిపి కౌన్సిలర్లుగా అభ్యర్థిత్వం ఖరారై నామినేషన్ల పరిశీలనలో అర్హత సాధించిన అభ్యర్థులను కలుపుకొని పట్టణంలో పలు వార్డుల్లో విస్తృతంగా ప్రచారం చేస్తున్నారు. ఇంటింటికి వెళ్లి సైకిల్ గుర్తుకు ఓటు వేసి తమను గెలిపించాలని అభ్యర్థిస్తున్నారు. అలాగే వైసిపి తరఫున చైర్పర్సన్ అభ్యర్థిత్వం పొందిన దివంగత, మాజీ ఎమ్మెల్యే గాదిలింగప్ప సతీమణి కూడా జోరుగా ప్రచారం సాగిస్తున్నారు. ఈమెకు తనయుడు వైసిపి జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్. గాదిలింగేశ్వర బాబు (చిన్నబాబు), సోదరి, తాజా మాజీ చైర్పర్సన్ భవాని, ఆమె భర్త మాజీ మున్సిపల్ చైర్మన్ రామలింగప్ప తదితరులు తోడుగా నిలిచి వైసిపి పార్టీ నాయకులు కార్యకర్తలను కలుపుకుని ప్రచారంలో వేగం పెంచారు. అంతేకాకుండా వీరికి స్థానిక వైసిపి మాజీ ఎమ్మెల్యే వై. వెంకటరామిరెడ్డి మద్దతు కూడా ఉంటోంది. వై. వెంకట్రామిరెడ్డి కుమార్తె, గుంతకల్లు తాజా మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్, వైసిపి జిల్లా ఉపాధ్యక్షురాలు నైరుతి రెడ్డి వెంకటలక్ష్మి వెన్నంటి ఉంటూ ఎన్నికల ప్రచారంలో బాసటగా నిలుస్తున్నారు. ఇలా ప్రధాన పార్టీల మున్సిపల్ చైర్పర్సన్ అభ్యర్థులు అప్పుడే ప్రచారంలో మునిగి తేలుతున్నారు. ఇదిలా ఉండగా గుంతకల్లు మున్సిపాలిటీలో పలు వార్డుల్లో టిడిపి అభ్యర్థులతో పాటు జనసేన, బిజెపి పార్టీల అభ్యర్థులు కూడా నామినేషన్లు వేశారు. గత వైసిపి ప్రభుత్వ హయాంలో జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో టిడిపిగెలుపొందిన వార్డుల్లో తిరిగి టిడిపి అభ్యర్థులు ఈ ఎన్నికల్లో కూడా పోటీ చేయాలని పార్టీ అధినేత నుంచి తమకు ఆదేశాలం దాయని పోటీలో ఉన్న టిడిపి అభ్యర్థులు చెబుతున్నారు. అయితే పొత్తులో భాగంగా తమకు కేటాయించిన వార్డుల్లో తాము పోటీలో ఉంటున్నట్లు బిజెపి అభ్యర్థులు చెబుతున్నారు. ఈ పరిస్థితి ఓటర్లను అయోమయస్థితిలోకి నెట్టేస్తోంది.

**టిడిపికి రెబల్స్ బెడద:**
ఎన్నికల షెడ్యూల్లో మార్పులు జరిగిన నేపథ్యంలో నవంబర్ 1న జరగనున్న మున్సిపల్ ఎన్నికల్లో టిడిపికి రెబల్స్ బెడద ఉంటోంది. ఏళ్ల తరబడి పార్టీని అంటిపెట్టుకొని కష్టించి పనిచేసిన వారికి ఎన్నికల సమయంలో తమకు టికెట్ కేటాయించలేదన్న కారణంగా టిడిపిలో కొందరు రెబల్సా నామినేషన్లు దాఖలు చేశారు. వారు పార్టీ పెద్దలు ఎంతగా బుజ్జగించినప్పటికీ తమ నామినేషన్లను ఉపసంహరించుకోక పోగా టిడిపి పార్టీ అధినేత, ముఖ్యమంత్రి చంద్రబాబు, ఆయన తనయుడు మంత్రి లోకేష్ ల ఫోటోలను పెట్టుకుని ప్రచారంలో పాల్గొంటామని అంటున్నారు. అయితే వైసీపీకి మాత్రం ఆ ఇబ్బంది లేకుండా పోయింది. పార్టీ నిర్ణయించిన అభ్యర్థులే బరిలో ఉంటూ ప్రచారంలో కొనసాగుతున్నారు తప్ప రెబల్స్ బెడద ఆ పార్టీకి లేదు.

# కొత్త హంగులతో పల్సర్ ఎన్ఎస్200 విడుదల

**-రూ.1.60 లక్షల ప్రారంభ ధరతో మార్కెట్లోకి కొత్త బైక్**
**-2026 మోడల్ను విడుదల చేసిన బజాజ్ ఆటో**
**-199.5 సీసీ ఇంజన్తో శక్తిమంతమైన పనితీరు**
**-25 బీహెచ్పీ పవర్తో సరికొత్త పల్సర్**
**-ఆరు గేర్లతో పాటు కొత్తగా క్విక్షిఫ్టర్**
**-ఐదు అంగుళాల కలర్ టీఎఫ్టీ డిస్ప్లే**
**-గూగుల్ మ్యాప్స్, టైప్-సీ యూఎస్బీ సదుపాయాలు**
**-నాలుగు రంగుల్లో అందుబాటులోకి కొత్త మోడల్**



హైదరాబాద్
ప్రముఖ ద్విచక్ర వాహన తయారీ సంస్థ బజాజ్ ఆటో తన పల్సర్ శ్రేణిలో సరికొత్త 2026 పల్సర్ ఎన్ఎస్200 మోడల్ను విడుదల చేసింది. ఆధునిక సాంకేతిక సదుపాయాలు, ఆకర్షణీయమైన ఫీచర్లతో రూపొందించిన ఈ బైక్ ప్రారంభ ధరను రూ.1.60 లక్షలుగా నిర్ణయించింది. కొత్త పల్సర్ ఎన్ఎస్200లో 199.5 సీసీ ఇంజన్ను అమర్చారు. ఇది 25 బీహెచ్పీ శక్తిని ఉత్పత్తి చేస్తుంది. ఆరు గేర్ల వ్యవస్థతో పాటు కొత్తగా క్విక్షిఫ్టర్ సదుపాయాన్ని జోడించారు. దీంతో గేర్లు మార్చుకునే ప్రక్రియ మరింత సులభతరం కానుంది. సాంకేతికత పరంగా ఈ మోడల్లో ఐదు అంగుళాల కలర్ టీఎఫ్టీ డిస్ప్లే ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తోంది. గూగుల్ మ్యాప్స్ మిర్రరింగ్ సదుపాయంతో ప్రయాణ సమయంలో మార్గాలను తెలుసుకునే అవకాశం ఉంటుంది. మొబైల్ పరికరాల కోసం టైప్-సీ యూఎస్బీ పోర్టును కూడా అందించారు. అత్యవసర బ్రేకింగ్ సమయంలో అప్రమత్తం చేసే పానిక్ బ్రేక్ అలర్ట్ ఫీచర్ను కొత్త మోడల్లో చేర్చారు. మొత్తం నాలుగు రంగుల్లో ఈ బైక్ అందుబాటులో ఉండనుంది. ఆధునిక ఫీచర్లతో పల్సర్ శ్రేణిని మరింత ఆకర్షణీయంగా తీర్చిదిద్దేందుకు బజాజ్ ఈ మార్పులు చేపట్టింది.

# నష్టాల నుంచి లాభాల్లోకి టాటా మోటార్స్

**-రెండో త్రైమాసికంలో మెరుగైన ఆర్థిక ఫలితాలు**
**-రూ.1,254 కోట్ల నికర లాభం నమోదు**
**-గత ఏడాది ఇదే కాలంలో రూ.867 కోట్ల నష్టం**
**-వాహన విక్రయాల జోరుతో పుంజుకున్న సంస్థ**
**-36 శాతం పెరిగిన కంపెనీ మొత్తం ఆదాయం**
**-రూ.25,338 కోట్లకు చేరిన త్రైమాసిక రాబడి**
**-రూ.2,800 కోట్లుగా నమోదైన నిర్వహణ లాభం**
**-జులై--సెప్టెంబర్లో 1.35 లక్షల వాహనాల విక్రయం**




**ముంబై:**
ప్రముఖ వాహన తయారీ సంస్థ టాటా మోటార్స్ నష్టాల నుంచి కోలుకుని లాభాల బాట పట్టింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం 2026--27 రెండో త్రైమాసికంలో కంపెనీ రూ.1,254 కోట్ల నికర లాభాన్ని ఆర్జించింది. గత ఆర్థిక సంవత్సరం ఇదే కాలంలో రూ.867 కోట్ల నష్టాన్ని నమోదు చేసిన సంస్థ, ఈసారి మెరుగైన ఆర్థిక ఫలితాలను వెల్లడించింది. జులై నుంచి సెప్టెంబర్ వరకు మూడు నెలల కాలంలో కంపెనీ మొత్తం ఆదాయం 36 శాతం పెరిగి రూ.25,338 కోట్లకు చేరుకుంది. వాహన విక్రయాలు పుంజుకోవడం సంస్థ ఆదాయ వృద్ధికి దోహదపడింది. ఈ త్రైమాసికంలో నిర్వహణ లాభం (ఇబిటా) రూ.2,800 కోట్లుగా నమోదైంది. మరోవైపు రెండో త్రైమాసికంలో మొత్తం 1.35 లక్షల వాహనాలను విక్రయించినట్లు కంపెనీ ప్రకటించింది. అమ్మకాలు పెరగడంతో పాటు ఆదాయం, నిర్వహణ లాభం మెరుగుపడటం సంస్థ ఆర్థిక పనితీరులో సానుకూల మార్పును సూచిస్తోంది. గత ఏడాది నష్టాలను ఎదుర్కొన్న టాటా మోటార్స్ ఈసారి రూ.1,254 కోట్ల నికర లాభాన్ని సాధించడం విశేషం.

# ముంబై ఇండియన్స్ ప్రధాన కోచ్‌గా కీరన్ పోలార్డ్




ముంబై:
ముంబై ఇండియన్స్ టీ20 జట్టుకు హెడ్‌కోచ్‌గా కీరన్ పోలార్డ్ నియమితుడయ్యాడు. ఐపీఎల్ 2027 సీజన్ నుంచి వెస్టిండీస్ మాజీ ఆల్‌రౌండర్ ఆ బాధ్యతలను నిర్వర్తించనున్నాడు. గతంలో ప్లేయర్‌గా, బ్యాటింగ్ కోచ్‌గా ముంబై ఇండియన్స్‌కు పోలార్డ్ సేవలు అందించాడు. ఇక నుంచి అతను ప్రధాన కోచ్‌గా తన విధులను చేపట్టనున్నాడు. హెడ్ కోచ్ బాధ్యతల నుంచి మహేళ జయవర్ధనే తప్పుకోవడంతో.. అతని స్థానంలో పోలార్డ్‌కు పదోన్నతి కల్పించారు. ప్లేయర్ నుంచి కోచ్ స్థాయికి పోలార్డ్ ఎదిగినట్లు ముంబై జట్టు తన ప్రకటనలో పేర్కొన్నది. 2009-2010 సీజన్ నుంచి 2022 సీజన్ వరకు అతను ముంబై జట్టులో ప్లేయర్‌గా కొనసాగాడు. ఐపీఎల్‌లో ముంబై తరపున 189 మ్యాచ్‌లు ఆడిన పోలార్డ్ .. వాటిల్లో 147.32 స్ట్రయిక్ రేట్‌తో 3412 రన్స్ చేశాడు. అతని బ్యాటింగ్ యావరేజ్ 28.67గా ఉన్నది. అతని ఖాతాలో 16 హాఫ్ సెంచరీలు ఉన్నాయి. బౌలింగ్‌లో అతను 69 వికెట్లు తీసుకున్నాడు. కెరీర్ బెస్ట్ 4-44గా ఉంది. 22 ఏళ్ల వయసులో పోలార్డ్ ముంబై జట్టులో చేరాడని, 16 ఏళ్లుగా అతను తమ కుటుంబంలో సభ్యుడిగా మారారని, ప్లేయర్‌గా ఎన్నో అద్భుత క్షణాలను అందించాడని, కోచ్‌గా తన అనుభవాలను పంచాడని, హెడ్‌కోచ్‌గా ఇప్పుడు పోలార్డ్ కొత్త బాధ్యతలు చేపట్టడం సంతోషంగా ఉందని ముంబై ఇండియన్స్ జట్టు కో-ఓనర్ నీతా అంబానీ తన ప్రకటనలో పేర్కొన్నారు. హెడ్‌కోచ్ బాధ్యతలు అప్పగించడం గౌరవంగా భావిస్తున్నట్లు పోలార్డ్ తెలిపాడు.

# మన బట్టలు, మన ఇష్టం..
# కామెంట్ చేసే హక్కు వాళ్లకు ఎవరిచ్చారు?



బాలీవుడ్‌లో మహిళలపై జరుగుతున్న ట్రోలింగ్ మరియు లింగ వివక్షపై ప్రముఖ నటి కృతి సనన్ తీవ్రస్థాయిలో మండిపడ్డారు. కరీనా కపూర్ ఖాన్ హోస్ట్‌గా వ్యవహరిస్తున్న 'వాట్ విమెన్ వాంట్' షోలో పాల్గొన్న ఆమె, తన దుస్తులపై జరిగిన అనవసర రాద్ధాంతం గురించి ఓపెన్‌గా మాట్లాడారు. ఇటీవల ఒక ప్రకటనలో తాను ధరించిన డ్రెస్ జాతీయ స్థాయిలో చర్చనీయాంశం కావడం, ఏకంగా ప్రైమ్‌టైమ్ న్యూస్ డిబేట్లు జరగడం తనను తీవ్రంగా షాక్‌కు గురిచేసిందని కృతి తెలిపారు. సాధారణంగా ఇలాంటి విమర్శలను తాను పట్టించుకోనప్పటికీ, మహిళలను చిన్న విషయాలకే టార్గెట్ చేయడం పెరిగిపోవడంతో స్పందించాల్సి వచ్చిందని పేర్కొన్నారు.మహిళలు ఎలాంటి దుస్తులు ధరించాలనేది పూర్తిగా వారి వ్యక్తిగత స్వేచ్ఛ అని, ఇతరులకు ఆ హక్కు ఎవరిచ్చారని కృతి నిలదీశారు. లావుగా ఉన్నా, సన్నగా ఉన్నా, కాస్త బరువు పెరిగినా బాడీ షేమింగ్ చేయడం, అనవసరమైన కామెంట్లు విసరడం పరిపాటిగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. సోషల్ మీడియా నెగెటివిటీని తట్టుకోలేక కామెంట్ సెక్షన్ ఆఫ్ చేసేయమని సోదరి సలహా ఇచ్చినా, ఎవరికీ భయపడి తాను వెనక్కి తగ్గేది లేదని తేల్చిచెప్పారు. కృతి ధైర్యవంతమైన వ్యాపార వైఖరిని కరీనా కపూర్ ఖాన్ పూర్తిగా సమర్థించారు. చిన్నపాటి శారీరక మార్పులకు కూడా జనం ముందు వివరణ ఇచ్చుకోవాల్సిన దుస్థితి నేడు నెలకొందని ఆందోళన వ్యక్తం చేస్తూ, కృతి స్పందించిన తీరు ఎంతో అభినందనీయమని ప్రశంసించారు.



నెట్టింటిని షేక్ చేసోన్న భాగ్య శ్రీ బోర్సే

# ప్రభాస్ ఫ్యాన్స్‌కు గుడ్‌న్యూస్..

### 'సలార్ 2' షూటింగ్ గురించి ప్రశాంత్ నీల్ ఏమన్నారంటే!



పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ పుట్టినరోజు సందర్భంగా అభిమానులకు వరుస సినిమా అప్‌డేట్స్ అందాయి. 'కల్కి' సీక్వెల్ నుంచి 'ఫౌజీ' వరకు పలు చిత్రాల గురించి ఆసక్తికర విషయాలు వెల్లడయ్యాయి. తాజాగా ప్రభాస్, దర్శకుడు ప్రశాంత్ నీల్ కాంబినేషన్‌లో రానున్న 'సలార్ 2' గురించి కూడా ఓ కీలక అప్‌డేట్ వచ్చినట్లు సమాచారం. ఈ సినిమా కోసం ఎంతోకాలంగా ఎదురుచూస్తున్న అభిమానుల్లో ఈ వార్త ఆసక్తిని పెంచుతోంది.'418' సినిమా ప్రమోషన్ సందర్భంగా ప్రభాస్, ప్రశాంత్ నీల్ కలుసుకున్నట్లు తెలుస్తోంది. ఈ సందర్భంగా ప్రభాస్‌కు ప్రశాంత్ నీల్ పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. ఆ తర్వాత ఇద్దరి మధ్య జరిగిన సరదా సంభాషణ అభిమానులను ఆకట్టుకుంటోంది.'418' సినిమా పూర్తిగా హారర్ కథాంశంతో తెరకెక్కుతోందా అని ప్రభాస్ ప్రశ్నించగా, ప్రశాంత్ నీల్ సరదాగా స్పందించారు. "అవునన్నా.. దీన్ని కూడా 'రాధేశ్యామ్'లా తీస్తే బాగోదు కదన్నా" అంటూ చమత్కరించారు. దీనికి ప్రభాస్ నవ్వుతూ స్పందిస్తూ.. "పంచ్ వేశావా.. 'సలార్ 2' షూటింగ్‌లో నీ సంగతి చెబుతా" అని అన్నారు. ఈ సరదా సంభాషణలోనే ప్రభాస్ అసలు విషయాన్ని ప్రస్తావించారు. "సలార్ 2 ఎప్పుడు? అదే నువ్వు ఇచ్చే బర్త్‌డే గిఫ్ట్" అంటూ ప్రశాంత్ నీల్‌ను అడిగారు. దీనికి ఆయన జూన్‌లో సినిమా షూటింగ్ ప్రారంభించే విషయాన్ని వెల్లడించారు. ప్రస్తుతం ప్రశాంత్ నీల్ ఎన్టీఆర్ హీరోగా నటిస్తున్న 'డ్రాగన్' చిత్రంతో బిజీగా ఉన్నారు. ఈ సినిమా పూర్తయిన తర్వాత ప్రభాస్‌తో చేయనున్న 'సలార్ 2'పై దృష్టి పెట్టే అవకాశం ఉందని తెలుస్తోంది. జూన్‌లో షూటింగ్ ప్రారంభమైతే ప్రభాస్ అభిమానులకు ఇది నిజంగానే ప్రత్యేకమైన కానుక కానుంది. అయితే షూటింగ్ ప్రారంభ తేదీ, షెడ్యూల్ వివరాలపై చిత్ర బృందం నుంచి అధికారిక ప్రకటన వెలువడితేనే పూర్తి స్పష్టత వస్తుంది. ప్రస్తుతం వినిపిస్తున్న సమాచారం ప్రకారం, వచ్చే ఏడాది జూన్ చివర్లో చిత్రీకరణ ప్రారంభమయ్యే అవకాశంపై చర్చ జరుగుతోంది. 2023 డిసెంబర్ 22న విడుదలైన 'సలార్: పార్ట్ 1 -- సీజ్‌ఫైర్' బాక్సాఫీస్ వద్ద భారీ విజయాన్ని అందుకుంది. ప్రశాంత్ నీల్ తెరకెక్కించిన ఈ యాక్షన్ డ్రామాలో ప్రభాస్ దేవ పాత్రలో, పృథ్వీరాజ్ సుకుమారన్ వరదరాజ మన్నార్ పాత్రలో నటించారు. ఖాన్సార్ అనే కల్పిత సామ్రాజ్యం నేపథ్యంలో స్నేహం, అధికారం, పోరాటాల చుట్టూ కథ సాగుతుంది. మొదటి భాగం చివర్లో వదిలిన ప్రశ్నలకు సమాధానాలు సీక్వెల్‌లో లభిస్తాయని అభిమానులు

# సైనికుడిగా గోపీచంద్
# పవర్‌ఫుల్ లుక్..

### -50 శాతం పూర్తయిన 'సింగ' షూటింగ్!




మాచో స్టార్ గోపీచంద్ ప్రస్తుతం 'సింగ' అనే యాక్షన్ ఎంటర్‌టైనర్‌తో ప్రేక్షకుల ముందుకు వచ్చేందుకు సిద్ధమవుతున్నారు. ఈ చిత్రంతో ప్రముఖ యాక్షన్ కొరియోగ్రాఫర్ వి. వెంకట్ దర్శకుడిగా పరిచయం అవుతున్నారు. విజయ్ చిల్లా, శశి దేవిరెడ్డి సంయుక్తంగా ఈ సినిమాను నిర్మిస్తున్నారు. 'సింగ' సినిమా చిత్రీకరణ శరవేగంగా కొనసాగుతోంది. ఇప్పటికే సినిమా షూటింగ్ 50 శాతం పూర్తయినట్లు చిత్రబృందం వెల్లడించింది. దీంతో ఈ ప్రాజెక్టుపై సినీ ప్రేక్షకుల్లో ఆసక్తి పెరుగుతోంది. గోపీచంద్ గతంలో విడుదల చేసిన ఫస్ట్‌లుక్ పోస్టర్‌లో ఆయన దూకుడైన రూపంతో ఆకట్టుకోగా, తాజాగా విడుదలైన పోస్టర్ మరో ప్రత్యేకతను సంతరించుకుంది.తాజా పోస్టర్‌లో గోపీచంద్ సైనికుడి పాత్రలో కనిపిస్తూ పవర్‌ఫుల్ లుక్‌తో ఆకట్టుకుంటున్నారు. ఆయన పాత్రలోని ఎమోషన్, యాక్షన్ నేపథ్యం సినిమాపై అంచనాలను పెంచుతున్నాయి. ఈ చిత్రంలో గోపీచంద్ పాత్ర ఎలా ఉండబోతోంది? కథలో ఎలాంటి మలుపులు ఉంటాయి? అనే విషయాలపై అభిమానుల్లో ఆసక్తి నెలకొంది. ఈ సినిమాతో అనార్కలి నాజర్ టాలీవుడ్‌లోకి అడుగుపెడుతున్నారు. ప్రముఖ సంగీత దర్శకుడు సామ్ సీఎస్ ఈ చిత్రానికి సంగీతం అందిస్తున్నారు. ఉత్కంఠభరితమైన యాక్షన్ సన్నివేశాలు, ఆసక్తికరమైన కథాంశం, భావోద్వేగాలతో కూడిన నాటకీయ అంశాలతో ప్రేక్షకులకు మంచి థియేట్రికల్ అనుభూతిని అందించడమే లక్ష్యంగా చిత్రబృందం పనిచేస్తోంది. దర్శకుడిగా వి. వెంకట్‌కు ఇది తొలి సినిమా కావడం, గోపీచంద్ సైనికుడి పాత్రలో కనిపించనుండటంతో 'సింగ'పై ఆసక్తి నెలకొంది. సినిమా విడుదల తేదీతో పాటు ఇతర వివరాలను చిత్రబృందం త్వరలో ప్రకటించే అవకాశం ఉంది. ఈ సినిమా అప్‌డేట్స్ కోసం గోపిచంద్ ఫ్యాన్స్ ఎంతో ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు.

# అతనంటే
# నాకు పిచ్చి ఇష్టం..

### -- పక్క రూమ్‌లోనే ఉన్నా కలవలేకపోయా..!!

సౌత్ ఇండస్ట్రీలో తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న హీరోయిన్లలో ఐశ్వర్య రాజేశ్ ఒకరు. గ్లామర్ పాత్రలకే పరిమితం కాకుండా, నటనకు ప్రాధాన్యత ఉన్న విభిన్నమైన కథలను ఎంచుకుంటూ ప్రేక్షకులకు దగ్గరవుతున్నారు. తెలుగు, తమిళ చిత్రాల్లో నటిస్తూ తనదైన ముద్ర వేస్తున్న ఈ అందాల భామ.. ఓ పాడ్‌కాస్ట్‌లో తన వ్యక్తిగత జీవితం, సినీ ప్రయాణానికి సంబంధించిన ఆసక్తికర విషయాలను పంచుకున్నారు. ఐశ్వర్య రాజేశ్ మాట్లాడుతూ.. హీరోయిన్‌గా గుర్తింపు తెచ్చుకోకముందు నుంచే సుశాంత్ సింగ్ రాజ్‌పుత్ అంటే తనకు చాలా ఇష్టమని వెల్లడించారు. అతడిపై ఉన్న అభిమానాన్ని తన స్నేహితులతో కూడా పంచుకునేవారని తెలిపారు. సుశాంత్‌ను ప్రత్యక్షంగా చూడాలని, అతడితో కలిసి ఓ ఫొటో దిగాలని అప్పట్లో ఎంతో ఆశపడినట్లు చెప్పుకొచ్చారు. ఇప్పటికీ సుశాంత్ అంటే తనకు ఎంతో ఇష్టమని, అతడిపై ఉన్న క్రష్ అలాగే ఉందని పేర్కొన్నారు.ఓసారి గోవా ఫిల్మ్ ఫెస్టివల్‌కు వెళ్లినప్పుడు సుశాంత్ సింగ్ రాజ్‌పుత్‌ను ప్రత్యక్షంగా చూసే అవకాశం ఐశ్వర్యకు లభించిందట. అతడిని చూసి ఎంతో సంతోషించిన ఆమె.. ఎలాగైనా ఓ ఫొటో తీసుకోవాలని అనుకున్నారట. ఫిల్మ్ ఫెస్టివల్ అనంతరం జరిగే నైట్ పార్టీకి సుశాంత్ వస్తారని భావించి ఎదురుచూశారు. అయితే ఆయన ఆ పార్టీకి రాకపోవడంతో నిరాశ చెందారట.ఆ తర్వాత రోజు సుశాంత్ హోటల్ నుంచి వెళ్లిపోయారని తెలిసిందని ఐశ్వర్య తెలిపారు. అంతేకాకుండా, తాను బస చేసిన గదికి పక్క గదిలోనే సుశాంత్ ఉన్నారని తర్వాత తెలుసుకున్నట్లు చెప్పారు. ఇంత దగ్గరగా ఉన్నప్పటికీ ఆయనను కలవలేకపోయాననే బాధ తనకు మిగిలిపోయిందని గుర్తుచేసుకున్నారు. తన అభిమాన నటుడితో కనీసం ఓ ఫొటో కూడా దిగలేకపోయాననే విషయం అప్పట్లో తనను నిరాశకు గురిచేసిందని వెల్లడించారు. సుశాంత్ సింగ్ రాజ్‌పుత్ అద్భుతమైన నటుడని, చాలా చిన్న వయసులోనే ఆయన మరణించడం బాధాకరమని ఐశ్వర్య రాజేశ్ పేర్కొన్నారు. ఆయన నటన, వ్యక్తిత్వం తనను ఎంతగానో ఆకట్టుకున్నాయని చెప్పుకొచ్చారు. సుశాంత్‌పై తనకున్న అభిమానం ఇప్పటికీ తగ్గలేదని, ఆయన అంటే తనకు ప్రత్యేకమైన ఇష్టమని వెల్లడించారు. దీంతో ఐశ్వర్య రాజేశ్ చేసిన ఈ వ్యాఖ్యలు ప్రస్తుతం ఆసక్తికరంగా మారాయి.



Printer. Publisher and owned by Dr k Soumya, and printed it kalanjali offset printers, shop no.23, sowjanya complex, N.K road , Srinivas Nagar, nandyal-518501 shop no 7, Sai revenue complex, mro office complex, nandyal town -518501 nandyal district (AP) editor: Dr k Sowmya. Email: editor@dream Times.in, editor@dream Times.co.in, cell:8500066609,RNI NO:APTEL 2021/81831